విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

బుధవారం 05 మార్చి 2025 | 8 పేజీలు

డీసీసీ కార్యదర్శి హఠాన్మరణం - 2లో..

రాష్ట్ర విధ్వంసం, దోపిడీ పునాదులపై లక్షల కోట్లకు జగన్: జీవీ - 6లో..

ఎమ్మెల్సీగా ఆలపాటికి ధ్రువీకరణ పత్రం అందజేత

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగ లక్ష్మి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలల్లో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా॥ : 6:20
సహారి : మంగళవారం ఉ॥ 5:05

ధనేకుల కోటేశ్వరరావు ధన్యజీవి

సీహెచ్ కోటేశ్వరరావు



విశాలాంధ్ర-విజయవాడ: మైలవరం నియోజకవర్గం కొవ్వూరు గ్రామానికి చెందిన తొలితరం సీపీఐ నేత ధనేకుల దశరథ రామయ్య కుమారుడు సీపీఐ మాజీ నాయకుడు, బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ధనేకుల కోటేశ్వరరావు ధన్యజీవి అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు కొనియాడారు. తండ్రి ద్వారా వచ్చిన కమ్యూనిస్టు వారసత్వాన్ని పునికిపుచ్చుకుని సన్న, చిన్నకారు రైతంగానికి పలు సేవలు అందించి పలువురు మన్ననలను అందుకున్నారని పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని పడమట లంకలోని తన నివాసంలో ధనేకుల కోటేశ్వరరావు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరపతి సహకార బ్యాంకులో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తూ నియోజకవర్గ ప్రజలకు బ్యాంకు సేవలను చేరువ చేశారని తెలిపారు. రైతంగానికి, పేద ప్రజలకు బ్యాంకు ద్వారా రావాల్సిన రాయితీలతో ఆర్థిక వనరులను కల్పించి మిగతా 2 లో...

ఆటో కార్మికుల సమస్యలు
పరిష్కరించాలి

- ప్రతి ఆటో కార్మికునికి రూ.15 వేలు ఇవ్వాలి
- ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగా, ఆకిటి డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటో కార్మికునికి రూ.15 వేలు ఇవ్వాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగా శ్రీనివాసరావు, ఆకిటి అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా మిగతా 2 లో...

మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించండి

విశాలాంధ్ర-నరసరావుపేట: మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాస రావులు అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా దినోత్సవ వారోత్సవాలపై జిల్లా అధికారులతో కలెక్టర్, ఎస్పీలు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహిళా దినోత్సవ వారోత్సవాల నిర్వహణ నోడల్ అధికారిగా ఐసీడీఎస్ పీడీ ఉమాదేవిని నియమించారు. మార్చి 6న జిల్లాలోని మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖలు వారీగా మహిళా ఉద్యోగినులు, ఆయా శాఖలు సేవలు అందించే మహిళా ఉద్యోగులను తగిన రీతిలో గౌరవించుకోవాలన్నారు. మహిళలకు సంబంధించిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మురళి, డీఎఫ్ఓ కృష్ణ ప్రియ, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిపై ఫిర్యాదు రావద్దు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవి తాగునీటి సమస్యపై ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.లక్ష్మీశ ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయితీరాజ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్లుతో మంగళవారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 286 గ్రామ పంచాయితీలు, 794 ఆవాసాల్లో 19 సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలు, 366 రక్షిత నీటి సరఫరా పథకాలు, 63 చిన్న రక్షిత నీటి సరఫరా పథకాలు, 439 డైరెక్ట్ పంపింగ్ పథకాలు, 7,917 చేతి పంపులు నీటి సరఫరా చేస్తున్నాయని తెలిపారు. ఇంకా మరమ్మతులు, పునరుద్దరణ చేయాల్సి ఉంటే తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు మండలస్థాయి కమిటీలు చొరవ చేపాలని, నీటి ఎద్దడి ఉన్న ఆవాసాలకు ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరాకు సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మిగతా 2 లో...

ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : సీపీఐ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో, పసుపులేటి అంకయ్య, సిరిపురపు బంగారమ్మ సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా స్థానిక యానాది కాలనీలో ఈ నెల 5వ తేదిన నిర్వహించనున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. సుద్దపల్లిడొంకలోని యానాది కాలనీలో మంగళవారం పర్యటించిన ఆయన కాలనీ ప్రజలతో మాట్లాడారు. కంటి ప్రాధాన్యతను వారికి వివరించారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే కంటి వైద్య శిబిరం ప్రాముఖ్యతను తెలియజేశారు. యానాది కాలనీ మొదటి లైనులోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గుడి వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతోందని చెప్పారు. కంటి సమస్యలతో ఇబ్బందిపడే వారు శిబిరాన్ని సందర్శించాలని మిగతా 2 లో...

(మొదటి పేజీ తరువాయి)

ధనేకుల కోటేశ్వరరావు ధన్యజీవి

ఆర్థిక పురోగతికి దోహదపడ్డారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయకార్యదర్శి బుడ్డి రమేష్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు ధనేకుల రాజేశ్వరరావు, సుందరయ్య, శ్రీనివాసరావు, బొర్రా వెంకటసుబ్బారావు, జమ్ముల సాంబశివరావు, ప్రముఖ న్యాయవాది భరద్వాజ, ధనేకులు శ్రీను తదితరులతో పాటు బంధువులు, మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రామిక భవన్‌కు లక్ష విరాళం

మైలవరంలో నిర్మిస్తున్న సీపీఐ కార్యాలయం శ్రామిక భవన్‌కు ధనేకుల కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని లక్ష రూపాయిలు విరాళాన్ని కుటుంబసభ్యులు ప్రకటించారు. ఈ మేరకు కోటేశ్వరరావు భార్య రాజారత్నకుమారి, కుమారుడు అజయ్‌కృష్ణ, కుమార్తె ప్రవీణలు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావుకు చెక్కును అందజేశారు. మైలవరం నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు విస్తరణ కోసం నిర్మిస్తున్న శ్రామికభవన్‌కు విరాళం ఇచ్చిన కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆటో కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ మానవ రవాణా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నటువంటి ఆటో కార్మికులు నేడు ప్రభుత్వానికి ఆదాయ వనరులుగా మాత్రమే కనబడుతున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ట్యాక్స్ రూపంలో కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్నటువంటి ఆటో రంగం కార్మికులు అనేక సమస్యలతో జీవితాలను వెళ్లబుచ్చుతున్నారన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న నిత్యవసర ధరలు వారి జీవితాలను కుంగదీస్తా ఉంటే రక్షణగా నిలబడవలసిన ప్రభుత్వాలు కనీసం వారికి ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చకుండా మోసం చేయడం దారుణమని విమర్శించారు. ఆటో కార్మికుల సంరక్షణ కోసం ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తా ఉన్నా ప్రభుత్వాలు కనీసం ఆ వైపుగా ఆలోచన కూడా చేయడం లేదని విమర్శించారు. తక్షణమే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల వద్ద నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న ఈ చలానాలకు సంబంధించిన జీఓ 21, 31లను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సంసిద్ధమవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆధీనంలోనే వెహికల్ ఫిట్‌నెస్ టెస్ట్ జరగాలని డిమాండ్ చేశారు. యూనియన్ నగర అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్, పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు మాట్లాడుతూ ఆటో కార్మికులు వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగవలసినటువంటి సందర్భం ఆసన్నమైందన్నారు. పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర రావు, గోవిందరాజు, శ్రీనివాసు, బాబురావు, శివ, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిపై ఫిర్యాదు రావద్దు

ఆదేశించారు. చలివేంద్రాల కార్యకలాపాలను నిరంతరం సమీక్షించాని, పారిశుధ్య పనులూ చేపట్టాని స్పష్టంచేశారు. మనుషులతో పాటు పశు పక్షాదులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వేడిని దృష్టిలో ఉంచుకుని బస్‌స్టేషన్లు, ఆసుపత్రులు, రహదారుల కూడళ్ల తదితర ప్రాంతాల వద్ద తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్సులో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

స్థానిక బిషప్ హజరయ్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ మంగళవారం తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. భద్రత పరంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ పగడ్బందీగా ఉండాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఇంగ్లీషు పరీక్షకు 40,608 మంది హాజరు కావాల్సి ఉండగా 39,686 మంది హాజరయ్యారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ సంఘటనలు చోటు చేసుకోలేదని వివరించారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కోరారు. శిబిరం వద్దకు వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలను, కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు 6281326694, 9533455155 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకయ్య, సుబ్బారావు, ముత్యాలరావు, బంగారమ్మ, లక్ష్మీ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై అవగాహన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆరు నెలల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారులు (ఎంపీడీఓలు) ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండల పరిధిలోని నున్న, పాతపాడులో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద అమలవుతున్న పలు ప్రాజెక్టులను మంగళవారం సందర్శించారు. ఎంపీడీఓలకు క్షేత్రస్థాయి అవగాహనను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఎంపీడీఓలలో కె కిరణ్ కుమార్ (వీరవాసరం, పశ్చిమగోదావరి), టి అనూహ్య (గూడూరు, కృష్ణా), బి విగ్నేస్ (విజయవాడ రూరల్, ఎన్‌టిఆర్), పి సాయి లహరి (కుప్పం, చిత్తూరు), టి చైతన్య కళ్యాణ్ (చింతూరు, ఎఎస్ఆర్), ఎం శ్రీ సాయి హర్ష (మంచింగ్‌పుట్టు(స్)), డి.ఎస్.ఆర్.బి. జిడి తేజ (కమీషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్), వి.జ్యోతి (మద్దిపాడు, ప్రకాశం), వివి సూర్య సాయి (గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్), ఎస్.దివిజ (ఖాజీపేట, వైఎస్ఆర్ కడప). వీరు కృష్ణా జిల్లా కానూరులోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఏపీఎస్ఐఆర్‌డీ)లో శిక్షణ పొందుతున్నారు. పంచాయత్ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (పిఆర్ అండ్ ఆర్‌డి) జాయింట్ కమిషనర్ జె సునీత, ఎన్‌టిఆర్ జిల్లా వాటర్ అండ్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ రాము మార్గదర్శకత్వంలో, ఎంపిడిఓలు వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. తొలుత వారు తాడేపల్లిలోని పంచాయత్ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించి, పరిపాలనా శిక్షణ గురించి తెలుసుకున్నారు. అనంతరం వారు నున్న, పాతపాడులో క్షేత్ర సందర్శనలు నిర్వహించి ఫామ్ పాండ్‌లను, మామిడి తోటలలో రింగ్ ట్రెంచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ కమిషనర్ సునీత విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయత్ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ

మంత్రి కె పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ఉపాధి పథకానికి ప్రాధాన్యత ఇస్తోందని ఉద్ఘాటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నుండి మరిన్ని నిధులను పొందాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ప్రత్యేకించి రైతులకు ప్రయోజనం చేకూర్చే అదనపు ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, భూగర్భజలాల స్థాయిలను మెరుగుపరచడం, పరిరక్షణలో ప్రభుత్వం యొక్క నిబద్ధతను ఆమె ఎత్తిచూపారు. మామిడి, ఉద్యానవనాల కోసం ప్రాజెక్టులు, అలాగే నీటిపారుదల కాలువలు, చెరువులలో పూడికతీత పనుల కోసం శాఖ గణనీయంగా పెట్టుబడి పెడుతోందన్నారు. ఉపాధి పనులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆస్తులు సృష్టించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఎంపీడీఓలలో అవగాహన పెంచడం ఈ క్షేత్రస్థాయి పరిశీలన లక్ష్యం అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ ఎంపిడిఒ కె మురళీకృష్ణ ప్రసాద్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపిఒ) ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కె శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ పిఎ కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శులు డి శ్రీనివాసరావు (నున్న), కోటిలింగమ్మ (పాతపాడు) తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల శాశ్వత పరిష్కారమే రీ సర్వే : కలెక్టర్

విశాలాంధ్ర-వీరులపాడు: భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ముఖ్య ఉద్దేశ్యంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా అన్నారు. మంగళవారం మండలంలోని గోకరాజు పల్లి గ్రామంలో

చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ భూముల రికార్డు ల అధికారి టీ త్రివిక్రమ రావు, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, వీరులపాడు మండల తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ ఐ సంధ్య, మండల సర్వేయర్ బసవరాజు, వెల్లంకి వీఆర్‌ఓ శ్రీనివాసరావు, సర్వేయర్ జీ దుర్గా, మండల వీఆర్వోలు రెవెన్యూ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ రీసెర్చ్ హాస్పిటల్ ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-నందిగామ: పట్టణంలోని సీఎం రోడ్ లో ఆయుష్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 16 సెంట్ల స్థలంలో 25 పడకల ఆయుష్ రీసెర్చ్ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని

నందిగామ లోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, విశ్వ హిందూ పరిషత్ తో పాటు వివిధ హిందూ, ముస్లిం, క్రైస్తవ ధార్మిక సంస్థలు, కార్మిక, ప్రజా సంఘాలకు చెందిన 90 సంస్థల ప్రతినిధులు సంతకాలు చేసిన వినతి పత్రంతోపాటు ఎమ్మెల్యే సౌమ్య లేఖను జతచేసి మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, పూర్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కాపా భానుప్రసాద్, కె.వి.ఆర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పచ్చ ఉమామహేశ్వరగుప్త లు ఎంపీ కేశినేని చిన్న కి అందజేశారు. ఆయుష్ వైద్య విధానాలపైన ఆయుర్వేద, యోగ, హోమియో, యునానీ, సిద్ధ వైద్య విధానాలకు చెందిన రీసెర్చ్ కేంద్రాలతో పాటు బౌద్ధ వైద్య విధానమైన సొవరిపా కూడా ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి, ప్రాచీన సాంప్రదాయ వైద్యవిజ్ఞానంలో దాగి ఉన్న గొప్పతనానికి సాంకేతికతను జోడించి ఆ వైద్య విజ్ఞాన ఫలాలను నందిగామ పరిసర ప్రాంతవాసులకు "ఆయుష్ గ్రిడ్" ద్వారా అందించవలసిందిగా కోరగా కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తో చర్చించి ఆయుష్ అధికారులతో తక్షణమే ఈ ప్రాజెక్ట్ వివరాలతో కూడిన ఎస్టిమేట్స్ తయారు చేయించి కేంద్ర ఆయుష్‌శాఖకు అందజేసి ప్రత్యామ్నాయ వైద్యవిధానాల పరిశోధనలకు పట్టుకొమ్మగా నందిగామను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

డీసీసీ కార్యదర్శి హఠాన్మరణం

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి లక్కిపోగు వీర వెంకట్రావు (జీటీటీ వెంకట్రావు) (60) మంగళవారం మధ్యాహ్నం హఠాన్మరణం పొందారు. సోమవారం రాత్రి ఆయనకు ఛాతీలో నొప్పి రాగా, కుటుంబసభ్యులు విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఆయన గతంలో విస్సన్నపేటలో వార్డు సభ్యునిగా, తిరువూరు ఏఎంసీ డైరక్టర్‌గా, డీసీసీ కార్యదర్శిగా కాంగ్రెస్‌లో కొనసాగుతూ, సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర వహించారు. బీఎస్పీ సీనియర్ నేత లక్కిపోగు ఆనందం కుమారుడైన వెంకట్రావు తొలినాటి నుంచి కాంగ్రెస్ కార్యకర్తగా ఉండగా, ఆయన సోదరుడు వందనకుమార్ హైదరాబాదు కమీషనర్‌గా పనిచేసి, పదవీవిరమణ అనంతరం బీఎస్పీ జాతీయ కమిటీ సభ్యునిగా కొనసాగుతున్నారు. వెంకట్రావు వివిధ రాజకీయపార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఆయన మృతదేహాన్ని సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు.

ఎక్సైజ్‌శాఖ విస్తృత దాడులు

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: తిరువూరు ఎక్సైజు సర్కిల్ అధికారులు విస్సన్నపేట మండలంలో మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో పెద్దఎత్తున నాటుసారా సామాగ్రి తయారీ పట్టుబడినట్లు సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. ప్రధానంగా ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, ఏలూరు జిల్లా చిత్తపూరు సరిహద్దుల్లో నాటుసారా బట్టీలు కొనసాగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఆయన వివరించారు. ఈ దాడుల్లో పెద్దఎత్తున సామాగ్రి బయటపడగా, తయారీదారులు పరారయ్యారని, త్వరలో వారిపై చట్టరీత్యా విచారణ చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

విద్యాశాఖ కార్యాలయంలో విచారణ...?

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండల విద్యాశాఖ కార్యాలయంలో పెద్దమొత్తం నిధులు దుర్వినియోగమైన విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మండల విద్యాశాఖ కార్యాలయ నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, ఇవన్నీ ఖర్చుయినట్లు మండలశాఖ అధికారులు చూపినట్లు సమాచారం. ఈ విషయమై ఎంత మొత్తం నిధులు ఎందుకు ఖర్చు చేశారనే విషయాలను విచారించాలని సూచిస్తూ ఎస్సీ, ఎస్టీ కమీషన్ డిప్యూటీ డైరెక్టర్ అశోక్‌బాబుకు సహాయ మానిటరింగ్ సెక్టోరియల్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించి, ఆదేశించినట్లు సమాచారం. విచారణ నిమిత్తం ఎమ్మీవో కార్యాలయానికి వచ్చిన అశోక్‌బాబును విచారించగా, తాను ఎందుకు ఇక్కడికి వచ్చాననే విషయమై సమాచారం ఇచ్చేందుకు అయిష్టత చూపారు. త్వరలో ఈ విషయమై మండల విద్యాశాఖలో నిధుల దుర్వినియోగం విషయమై పూర్తిస్థాయి విచారణ, చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ

విశాలాంధ్ర-గంపలగూడెం : రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన గంపలగూడెం మండలం నెమలి గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణం సందర్భంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించిన మైలవరం ఏసిపి ప్రసాద్ రావు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరువూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గిరిబాబు, గంపలగూడెం ఎస్ఐ శ్రీను, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారిని ఎన్ సంధ్య సంధ్య తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి హుండీల లెక్కింపు

విశాలాంధ్ర, గంపలగూడెం: నెమలిలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవాలయము నందు మంగళవారం దేవస్థానంలో స్వామి వారి హుండీలను 4-2-20 25 నుండి4-3-2025 భక్తులు హుండీలలో వేసిన కానుకలను లెక్కించగా రూ.10,22,390 ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం దేవాదాయ శాఖ అధికారి తనిఖీదారు కే అనురాధ, గ్రామ పెద్దలు బెల్లం మధుసూదన్ రావు, వసమా చినబాబు, సత్య సేవా సమితి సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

7న సబ్ జూనియర్ కబడ్డీ సెలక్షన్స్

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణాజిల్లా మొవ్వ పి ఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 7వతేదీమధ్యాహ్నం3గంటలకుఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్.బాల బాలికల కబడ్డీ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల రామారావు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు 2009 మార్చి 30వ తేదీ తర్వాత పుట్టిన క్రీడాకారులు అర్హుల బరువు 55 కిలోలలోపు ఉండాలని మంగళవారం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులుతమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని, మిగిలిన వివరాలకు 9704063555, 9398268313లకు ఫోనుచేయాలని కోరారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్ఐ.

విశాలాంధ్ర-పామర్రు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలలో భాగంగా మంగళవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్ష కేంద్రాలను పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్ తనిఖీలు అనంతరంసెక్యూరిటీ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు

విద్యార్థులకు అవగాహన : ఏఎస్ఐ

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఈనెల 8న మహిళ దినోత్సవం సందర్భంగా యలమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు ముఖ్యంగా మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలపై మంగళవారం పెదపారుపూడి పోలీస్ స్టేషన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్ఐ ప్రకాశరావు మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు సోమేశ్వరరావు, హెచ్ సి గుడపాటి కనకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పీఎం భీమాజ్యోతి'ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ఘంటసాల: ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకాన్ని సద్వినియోగపర్చుకోవాలని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ లో జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఖాతాదారులను కోరారు. మండల కేంద్రమైన ఘంటసాల సప్తగిరి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ జి శ్రీనివాస్ దయాల్ అధ్యక్షతన లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు మాట్లాడుతూ బ్యాంకుల్లో అనేక పథకాలు ఉన్నాయని ఆ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం, జీవన సురక్ష బీమా సురక్ష పథకం వాటితో పాటు అనేక పథకాలు ఉన్నాయని వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. బ్యాంకు ఖాతాదారుడు తూము శేఖర్ బాబు ప్రధానమంత్రి బీమా జ్యోతి పథకం చెల్లించడంతో గత కొద్ది రోజుల క్రితం మరణించగా అతని భార్య తూము గోవర్ధనకు జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ చేతుల మీదుగా రూ 2 లక్షల చెక్కును మేనేజర్ జి శ్రీనివాస్ దయాల్ ఆమె చేతికి అందించారు. జిల్లా ఆదర్శ రైతు అయినపూడి విజయ్ కుమార్ అహో బలరాం, వడ్డమూడి వెంకట కృష్ణారావు, శ్రీధర్ కే సతీష్, హరిత, గొర్రెపాటి శ్రీనివాసరావు బ్యాంకు సిబ్బంది శ్రీనివాసరావు తదితర ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎఫ్ ఎ4 పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండలం లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో నిర్మాణాత్మక మూల్యాంకనం (ఎఫ్ ఎ4) ప్రశాంతంగా మొదలయ్యాయి. ఈ విద్యా సంవత్సరంలో ఇంకా ఎస్ఏ2 పరీక్షలు నిర్వహిస్తారని వాటితో విద్యా సంవత్సరం ముగుస్తుం దని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 15వ తేది నుండి ఒంటి పూట బడులు నిర్వహిస్తారని తెలిపారు.ప్రస్తుతం పదవ తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ పరీక్షలు జరుగుతున్నాయని, 17 వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారని ఎమ్మీఓ2 శ్రీనివాస్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములవుదాం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : మనవ మనుగడకు కీలకమైన ప్రకృతి వ్యవసాయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.లక్ష్మీశ పిలుపునిచ్చారు. స్థానిక లయోలా కళాశాల సమీపంలోని రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం జరిగిన వర్క్షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అన్నదాతల్లో ఉన్న అపోహలను తొలగించి ఆరోగ్యకర ఉత్పత్తుల్లో సమాజానికి మేలు కిగించే సాగు విధానాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ర్యాలీలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కార్యక్రమాలు, పొలం సందర్శనలు వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సాగులో సేంద్రీయ ఎరువులు, జీవ ఉత్ప్రేరకాలు, కషాయాలు, ద్రావణాలు వినియోగించటవ వల్ల ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు చేతికందుతాయని తెలిపారు. దశల వారీగా ప్రకృతి వ్యవసాయాన్ని పెంచి జిల్లాను ఆదర్శంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ డీఎంఎఫ్ విజయకుమారి, ట్రైనర్లు రవికుమార్, వాణి, అంజిరెడ్డి, రాజశ్రీ, సింధు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-నందిగామ:- సచివాలయా ల్లోని ఉద్యోగస్తులు అందరూ ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. మంగళవారం ఆమె పట్టణ పరిధిలోని 7,8,9,10 వార్డు సచివాలయాల్లో పర్యటించారు ఉద్యోగులను స్వయంగా కలిసి ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది ప్రతిరోజూ హాజరుకావాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని అలాగే వార్డుల పరిధిలో తమ దృష్టికి వచ్చిన సమస్యల గురించి వెంటనే తన దృష్టికి తీసుకువస్తే శాసనసభ్యులు వారి ఆదేశాల ప్రకారం సంబంధిత అధికారుల ద్వారా వెంటనే త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు ముందుకు సాగుతానని అన్నారు. వార్డు సచివాలయాల కౌన్సిలర్లు, కూటమి ఇన్చార్జులు,కూటమి నాయకులు వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు...

ముమ్మరంగా మినుము నూర్పిళ్లు

విశాలాంధ్ర-పమిడిముక్కల: రైతులు యంత్రాల సాయంతో మినుము నూర్పిళ్లు చేస్తున్నారు. మంటాడ తాడంకి కపిలేశ్వరపురం పమిడిముక్కల ముళ్లపూడి చోరగుడి తదితర ప్రాంతాల్లో నూర్పిళ్లు ప్రారంభించారు. పైరు తీయుటకు వలస కూలీలు రాకపోతే డిమాండ్ ఎక్కువ ఉండేదని మినుము ముమ్మరంగా తీస్తున్నారని వాతావరణం మార్పు రాకముందే ఇంటికి చేరేలా రైతులు తొందరపడుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయము, తోటరావులపాడు

టెండరు ప్రకటన

ఆర్.సి.నెం./03/ఎ/2025 తేదీ: 04-03-2025

ఎన్.టి.ఆర్.జిల్లా, చందర్లపాడు మండలం, **తోటరావులపాడు** గ్రామపంచాయితీ పరిధిలో **2025-2026** సంవత్సరమునకు అనగా **ది.01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు** కాంట్రాక్టు పద్ధతిపై ఈ క్రింది షెడ్యూలు దాఖలా పనులు నిర్వహించుటకు **10-3-2025న 10.30 గంటల వరకు** పంచాయితీ కార్యదర్శి వారిచేగాని లేదా వారి అనుమతి పొందిన వారిచే టెండర్లు స్వీకరించబడి అదేరోజు **మధ్యాహ్నం 12.00గం.లకు** హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఇతర వివరములకు, షరతులకు ఈ కార్యాలయము పనిచేయు వేళల్లో తెలుసుకొనగలరు.

వ.నెం.	వివరము	కాలము	ధరావత్తు
1.	పారిశుద్ధ్య నిర్వహణ - 03	1-4-2025 నుండి	2000/-
2.	తాగునీటి సరఫరా - 01	31-3-2026 వరకు	
3.	ఎలక్ట్రీషియన్ - 01		

సం/- ఎం.లక్ష్మి, సర్పంచ్, తోటరావులపాడు
సం/- డి.తిరుపతమ్మ, పంచాయితీ కార్యదర్శి, తోటరావులపాడు

గ్రామ పంచాయితీ కార్యాలయము, కొడవటికల్లు

టెండరు ప్రకటన

ఆర్.సి.నెం./02/2025 తేదీ: 04-03-2025

ఎన్.టి.ఆర్.జిల్లా, చందర్లపాడు మండలం, **కొడవటికల్లు** గ్రామపంచాయితీ పరిధిలో **2025-2026** సంవత్సరమునకు అనగా **ది.01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు** కాంట్రాక్టు పద్ధతిపై ఈ క్రింది షెడ్యూలు దాఖలా పనులు నిర్వహించుటకు **10-3-2025న 11.00 గంటల వరకు** పంచాయితీ కార్యదర్శి వారిచేగాని లేదా వారి అనుమతి పొందిన వారిచే టెండర్లు స్వీకరించబడి అదేరోజు **మధ్యాహ్నం 2.00గం.లకు** హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఇతర వివరములకు, షరతులకు ఈ కార్యాలయము పనిచేయు వేళల్లో తెలుసుకొనగలరు.

వ.నెం.	వివరము	కాలము	ధరావత్తు
1.	పారిశుద్ధ్య నిర్వహణ - 02	1-4-2025 నుండి	2000/-
2.	తాగునీటి సరఫరా - 01	31-3-2026 వరకు	
3.	ఎలక్ట్రీషియన్ - 01		

సం/- సిహెచ్.రవిబాబు, సర్పంచ్, కొడవటికల్లు
సం/- జి.రమేష్, పంచాయితీ కార్యదర్శి, కొడవటికల్లు

గ్రామ పంచాయితీ కార్యాలయము, కాసరబాద

టెండరు ప్రకటన

ఆర్.సి.నెం. 03/2025 తేదీ: 04-03-2025

ఎన్.టి.ఆర్.జిల్లా, చందర్లపాడు మండలం, **కాసరబాద** గ్రామపంచాయితీ పరిధిలో **2025-2026** సంవత్సరమునకు అనగా **ది.01-04-2025 నుండి ది. 31-03-2026 వరకు** కాంట్రాక్టు పద్ధతిపై ఈ క్రింది షెడ్యూలు దాఖలా పనులు నిర్వహించుటకు **10-03-2025న 10.30 గంటల వరకు** పంచాయితీ కార్యదర్శి వారిచేగాని లేదా వారి అనుమతి పొందిన వారిచే టెండర్లు స్వీకరించబడి అదేరోజు **మధ్యాహ్నం 12.30గం.లకు** హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఇతర వివరములకు, షరతులకు ఈ కార్యాలయము పనిచేయు వేళల్లో తెలుసుకొనగలరు.

వ.నెం.	వివరము	కాలము	ధరావత్తు
1.	తాగునీటి సరఫరా, కాసరబాద - 01	1-4-2025	2000/-
2.	తాగునీటి సరఫరా, ఉస్తేపల్లి - 01	నుండి	
2.	పారిశుద్ధ్య నిర్వహణ - 01	31-3-2026	2000/-
3.	ఎలక్ట్రీషియన్ - 01	వరకు	

సం/- సరాల అమిరిరెడ్డి, సర్పంచ్, కాసరబాద
సం/- ఈదర రాజేష్, పంచాయితీ కార్యదర్శి, కాసరబాద

ఎస్టీయూకి మద్దతు ఇచ్చిన వారికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-గుడివాడ : రాష్ట్రంలో జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, కృష్ణ గుంటూరు ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎస్టీయూ బలపరిచిన జి.శ్రీనివాసులునాయుడు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పి.రాజశేఖర్ లను అఖండమైన మెజారిటీతో గెలిపించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్లకు ఎస్టీయు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నిస్తాం అంటూ దశాబ్దాల తరబడి కబుర్లు చెప్పిన నాయకులను నమ్మవద్దని, ఉద్యోగులకు నిరుద్యోగులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఫలితాలను ఇచ్చే వ్యక్తులను ఎన్నుకోవాల్సిందిగా ఎస్టీయూ ఇచ్చిన పిలుపు, చేసిన ప్రచారం మేరకు అద్భుతమైన విజయాన్ని ఓటర్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ ఎన్నికలో రాజకీయ పార్టీలు ప్రమేయం వద్దంటూ ఒకవైపు ప్రచారం చేస్తూ, మరోవైపు రాజకీయపార్టీల మద్దతు తెర వెనుకనుండి పొందడాన్ని గ్రాడ్యుయేట్ లందరూ స్పష్టంగా గ్రహించి తగిన రీతిలో బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. హామీ మేరకు గెలిచిన అభ్యర్థులను ఉపాధ్యాయులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏ.ఎస్.వి ప్రసాద్, జిల్లా శాఖ సహాధ్యక్షుడు పివిఎన్డి ప్రసాద్, గుడివాడ పట్టణ శాఖ అధ్యక్ష కార్యదర్శులు కె.జె డానియల్, ఆర్ మోహన్‌రావు, ఐ.అరవింద్, పరసా శ్రీను, మడకా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుగాంపునకు గోల్డెన్ మెజీషియన్ అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : విజయవాడకు చెందిన డాక్టర్ గుగాంపు కు గోల్డెన్ మెజీషియన్ అవార్డు రావడం హర్షణీయమని సఫయికర్మ చారి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిఖరం కీర్తి ప్రకాష్ అన్నారు. విజయవాడలో పుట్టి పెరిగి విదేశాలకు వెళ్లి ప్రపంచ ప్రసిద్ధ ఇంద్రజాలికులుగా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ పురస్కార గ్రహీతగా పలు అవార్డులను సొంతం చేసుకున్న డాక్టర్ గుగాంపు గోల్డెన్ మెజీషియన్ అవార్డుతో పాటు జీవిత సాఫల్య పురస్కారాన్ని కూడా సొంతం చేసుకోవడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఇంద్రజాల దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెలలో విశాఖపట్నంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో విజయవాడకు చెందిన డాక్టర్ గుగాంపునకు గోల్డెన్ మెజీషియన్ అవార్డును ఇండియన్ మ్యాజిక్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు బివిస్ రెడ్డి చేతుల మీదుగా అందజేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఇండియన్ మ్యాజిక్ అకాడమి స్థాపించి పదేళ్లయిన సందర్భంగా పదవ వార్షికోత్సవ వేడుకలను సంస్థ వ్యవస్థాపకులు బివిస్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికులు పీసీ సర్కార్ సీనియర్ జయంతిని పురస్కరించుకుని ఇండియన్ మ్యాజిక్ అకాడమీ వ్యవస్థాపకులు ప్రపంచ ప్రసిద్ధ ఇంద్రజాలికులు బివిస్ రెడ్డి ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత పీసీ సర్కార్ సీనియర్ 102వ జయంతి వేడుకలు కనులపండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఇంద్రజాలికులు పీసీ సర్కార్ జూనియర్ తో పాటు, విజయవాడకు చెందిన డాక్టర్ గుగాంపు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుండి పలువురు ఇంద్రజాలికులు హాజరై తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో భాగంగా విజయవాడకు చెందిన డాక్టర్ గుగాంపును గోల్డెన్ మెజీషియన్ అవార్డుతో పాటు, జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. గత 30 ఏళ్లుగా కువైట్ లో ఉంటూ, 23 దేశాల్లో, 16 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చిన డా.గుగాంపును పీసీ సర్కార్ జూనియర్ తో పాటు, బివిస్ రెడ్డిలు ప్రశంసించారు. విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ జి.ఎస్.ఎన్ రాజు, పార్లమెంట్ సభ్యులు భరత్, లీడర్ పత్రిక ఎడిటర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్ 2025 ను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారని మెజీషియన్ బివిస్ రెడ్డిని ప్రశంసించారు.

ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలను తక్షణ పరిష్కరించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీస్ చలం, బుద్దే రాజా డిమాండ్ చేశారు. స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న 4వ డివిజన్ శానిటరీ కార్యాలయం, లయోలా కాలేజ్ వద్ద సర్కిల్-3 సిల్ట్ కార్మికులను ఉద్దేశించి మంగళవారం వారు ప్రసంగించారు. అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికులు ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనాన్ని అమలు చేయాలని పలు డిమాండ్లతో యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమాలు సాగిస్తుంటే మరో ప్రక్క ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలోకి వారిని మార్చాలని ప్రయత్నించటం దుర్మార్గమన్నారు. పారిశుద్ధ్య కార్మికుల జోలికి వస్తే ప్రభుత్వానికి ఎనలేని చెడ్డపేరు వస్తుందని తక్షణం ప్రభుత్వం గమనించి వారి సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కరోనా, వరదల సమయంలోనూ, మరే ఇతర కార్యక్రమాల్లో పారిశుద్ధ్య కార్మికుల అందిస్తున్న సేవ ఎనలేనిదని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఏబీసీ ఆపరేషన్లకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : అనిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబందిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగర పర్యటనలో భాగంగా అజిత్‌గార్బేజ్ ట్రాన్స్‌ఫర్‌స్టేషన్‌లోని ఏబీసీ ఆపరేషన్స్ సెంటర్, బయోమెథనైజేషన్ ప్లాంట్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. అనిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్ల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఆపరేషన్ పరికరాలు మరింత పెంచాలన్నారు. అజిత్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ వద్ద ఉన్న బయోమిథనైజేషన్ ప్లాంట్‌లో కూరగాయల వ్యర్థాల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో ఇంచార్జి సీఎంవోహెచ్ డాక్టర్ సురేష్‌బాబు, ఎస్ఈ సత్యకుమారి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో డాక్టర్ బాబుశ్రీనివాస్, వెహికల్ డిపో ఇన్‌చార్జ్ ఈఈ ఏసుపాదం పాల్గొన్నారు.

డిసిల్టింగ్ పనులు నిరంతరం చేయాలి : కమిషనర్ ధ్యాన చంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో నిరంతరం డిసిల్టింగ్ పనులు నిర్వహిస్తుండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. స్థానిక అజిత్‌సింగ్ నగర్ వద్ద గల డాబాకోట్ల సెంటర్లో జరుగుతున్న డీజిల్టింగ్ పనులను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డీసిల్టింగ్ పనుల్లో ఎలాంటి జాప్యం వహించరాదని అడ్డువచ్చిన ఆక్రమణలను తొలగించి పూర్తిస్థాయిలో డీసిల్టింగ్ పనులను పూర్తిచేసి వర్షపు నీరు నీటి పైన నిలవకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటిస్తున్నప్పుడు పాత ఎస్టిపిను గమనించి దానిని పునరుద్ధరించి ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జి డా.సురేష్‌బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.బాబుశ్రీనివాస్, వెహికల్ డిపో ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏసుపాదం పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఇబ్బంది లేకుండా చూడండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని అన్న క్యాంటీన్లకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. స్థానిక అజిత్‌సింగ్ నగర్ వద్దగల అన్న క్యాంటీన్‌ను కమిషనర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడున్న ప్రజలతో స్వయంగా కమిషనర్ మాట్లాడి ఆహార నాణ్యత, అన్న క్యాంటీన్‌లో ఉన్న వసతులపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలం మొదలు కావటంతో మధ్యాహ్నం అన్నా క్యాంటీన్‌లో భోజనం చేసే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు షెడ్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇంటర్ పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు మినహాయింపు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 9 మంది దివ్యాంగవిద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు మినహాయింపు ఇచ్చినట్లుసి ఎస్ డి సుధాకర్, డివో బి గంగాధర్ తెలిపారు. 216 మంది విద్యార్థులకు ఏడుగురు గైర్హాజరు కాగా 9 మందికి వినయం ఇవ్వగా 200 మంది పరీక్షలు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలకు కూడా సిట్టింగ్ స్క్వాడ్ హరికృష్ణ, సాయి కృష్ణ సాయి కుమార్ హాజరై (అవనిగడ్డ) పరీక్షా కేంద్రాల్లోతనిఖీలు నిర్వహించారు.

వార్షికోత్సవానికి రూ.50 వేలు విరాళం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ పీఎంశ్రీ శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవ నిర్వహణకు పాఠశాల పూర్వ విద్యార్థిని, పూర్వ(విశ్రాంత) హెచ్ఎం మండవ లక్ష్మీ నీలవేణి తన తండ్రిమండవ వెంకటరత్నం జ్ఞాపకార్థం రూ.50 వేలు అందజేశారు. పాఠశాలవార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖాధికారి. పి వి జె రామారావు చేతుల మీదగా డివైఈఒ ఐ పద్మారాణి, ఎంఈఓ లు ఎన్ శివశంకరరావు, కే శ్రీలక్ష్మిల సమక్షంలో అందజేసినట్లు హెచ్ఎం సూర్యదేవర శ్రీదేవి మంగళవారం తెలిపారు. మండవ లక్ష్మీ నీలవేణి అందజేసిన నగదును బ్యాంకులో ఫిక్స్ చేసి వచ్చిన వడ్డీని ఏటా నిర్వహించే వార్షికోత్సవం సందర్భంగా వినియోగిస్తామని వివరించారు.

టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : పది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ముందు గ్రాండ్ (గ్రాండ్ టెస్ట్ పరీక్షలకు విద్యాశాఖ విద్యా శాఖ డైరెక్టర్.వి. విజయరామరాజు ఆదేశాలు జారీ చేయడంతో గ్రాండ్ టెస్ట్.పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమైనాయి. ఈనెల 13 వరకు ప్రతిరోజు మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి 4:30 వరకు జరిగే ఈ పరీక్షలకు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల నుంచి 530 మంది విద్యార్థులు ఈ పరీక్షలలో పాల్గొన్నారు.

కాలనీలో లైట్లు వేయండి

విశాలాంధ్ర-నందిగామ:- మా కాలనీలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి అంటూ పట్టణ శివారు అనాసాగరం కాలనీ వాసులు మంగళవారం కమిషనర్ ఈవీ రమణ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు వినతి పత్రాన్ని తీసుకున్న కమిషనర్ మాట్లాడుతూ వెంటనే కాలనీలో తానే స్వయంగా పర్యటిస్తానని అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో జీవితఖైదు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: వృద్ధురాలి హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు జైలు శిక్ష విధిస్తూ 7వ అదిషనల్ డిస్ట్రిక్ జడ్జీ ఎస్.నాగేశ్వరరావు తీర్పును వెల్లడించారు. గుణదలకు చెందిన వృద్ధురాలైన మాధురి నవంబర్ 30వతేదీన 2014 సంవత్సరంలో హత్యకు గురైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మృతదేహం పై బంగారు ఆభరణాలను కూడా దొంగిలించారు. దీంతో పోలీసులు దర్యాప్తు కృష్ణాజిల్లా తోట్లవల్లూరుకు చెందిన అబ్దుల్ అజీజ్ అలియాస్ బుజ్జిను అదుపులోకి తీసుకుని విచారించారు. వృద్ధురాలిని హత్య చేసి చేతికి ఉన్న బంగారం గాజులు చోరీకి చేశాడని దర్యాప్తు తెలిసింది. అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నేరం రుజువుకావడంతో అక్రమంగా ఇంట్లో ప్రవేశించినందుకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా, నగలు దోచిపి చేసిందుకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా, హత్య చేసిందుకు జీవితఖైదు, రూ1000 జరిమానా, చోరీ సొత్తు కలిగినందుకు 3 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ ఏకకాలంలో జీవితఖైదు, రూ.3వేలు జరిమానాను విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.జెమ్స్, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ప్రస్తుత మాచవరం సీఐ ప్రకాష్, సీఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో 18 మంది సాక్షులను విచారించారు.

తీసుకున్న డబ్బు కడతాను గడువివ్వండి..

సెల్ఫీ వీడియోలో కలెక్టర్‌కు సంపతి వినతి

విశాలాంధ్ర- దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని మూడో సచివాలయం వెల్ఫేర్ అండ్ అడ్మిన్ సంపతి లక్ష్మీ ప్రసాద్ ఇటీవల వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు సంబంధించిన పింఛను డబ్బులు రూ.8.43 లక్షలు తీసుకుని ఉడాయించిన విషయం విదితమే. అయితే మంగళవారం తన భార్య, పిల్లలతో కలిసి ఓ సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. అందులో పేర్కొన్న అంశాలు ఆయన మాటల్లోనే.. తాను చేసిన తప్పు ఒప్పుకుంటున్నాను. ఆన్ లైన్ బెట్టింగుల అలవాటు ఉంది. అందులో డబ్బులు పోగొట్టుకున్నాను. తద్వారా మోసపోయానని గ్రహించాను. తాను చేసిన తప్పునకు భార్య, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం మేమంతా రోడ్డున పడ్డాం. అందరం కలిసి ఆత్మహత్య చేసుకోవాలని కూడా పూనుకున్నాం. దయచేసి ఒక్క నెల గడువిస్తే తల్లిదండ్రుల వద్ద డబ్బు తీసుకుని వచ్చి కడతాను. కావున జిల్లా కలెక్టర్, దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ అవకాశం కల్పించాలని కోరారు.

భూసార పరిరక్షణపై అవగాహన

విశాలాంధ్ర-తెనాలి : కొలవరంలో మంగళవారం గుంటూరు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కోర్డినేటర్ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మొక్కజొన్నలో చీడపీడల యాజమాన్యం, రబీ పంట అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యత మొదలగు అంశాలపై రైతులకు తగు సూచనలు చేశారు. జీవన ఎరువుల ప్రాధాన్యత, భూసార పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. తెనాలి వ్యవసాయ అధికారులు, గుంటూరు జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ శివకుమారి, తెనాలి ఏడిఏ ఉష, మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్, వీఏఏ వాణి, ఏఈఓలు, రైతులు, వ్యవసాయక్షేత్ర విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

జోసిల్‌లో భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర- మేడికొండూరు : ఈ నెల 4వ తేది నుంచి 10వ తేది వరకు జరిగే జాతీయ భద్రతా వారోత్సవా లు ప్రారంభం సందర్భంగా జోసిల్ కర్మాగారంలో కంపెనీ సెక్రటరీ అండ్ డీజీఎం(ఫైనాన్స్) కోటా రఘురాం భద్రతా జెండాను ఎగురవేశారు. భద్రతా ప్లెడ్జిను చేయించి జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో ప్రతిఒక్కరూ భద్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ నెల 10వ తేది వరకు ప్రతిరోజు భద్రత గురించి క్విజ్, వ్యాసరచనలు, మహిళలకు ఎల్‌పీజీ గ్యాస్ భద్రత గురించి అవగాహనను కలిపించి వారికి కూడా భద్రత గురించి క్విజ్ నిర్వహించారు. పరిసర గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా భద్రత గురించి తెలియజేసి క్విజ్ నిర్వహించారు. కంపెనీ అడ్వైజర్స్ రామినేని జెనర్జీ బాబు, యడ్లపాటి భానుప్రసాద్ పాల్గొన్నారు.

గర్భిణీలు పోషకాహారం తప్పక తీసుకోవాలి

డాక్టర్ వేముల ప్రియాంక

విశాలాంధ్ర-తెనాలి : నందుల పేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలను సత్వర నమోదు చేసి, వారికి పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్ధాలను, వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా అందించాలని ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు సూచించారు. డిపిఎంఒ జంగం శ్యామ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి చికిత్స అందించే విధంగా తోడ్పడాలన్నారు. తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, దోమలు అభివృద్ధి చెందకుండా మడ్డి ఆయిల్ కానీ, వాడిన వంట నూనెను కానీ పిచికారి చేసినట్లయితే దోమల అభివృద్ధి నివారించవచ్చని తెలిపారు. హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న, పుష్పలత, ఎఎన్ఎంలు సుమతి, తులసి, భువనేశ్వరి, కొండమ్మ, నాగేశ్వరమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మలినేని విద్యార్థినిలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తాము బాగుంటేనే తమ కుటుంబం బాగుంటుందన్న విషయాన్ని గుర్తెరిగి తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించరాదని హోప్‌విన్ హాస్పిటల్స్ ఛైర్‌పర్సన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టేట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (గుంటూరు ప్రసూతి వైద్యులు, గైనకాలజికల్‌ల స్థానిక సంఘాల సమాఖ్య), హోప్‌విన్ హాస్పిటల్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ షమా సుల్తానా మలినేని పెరుమళ్ళ మహిళా ఫార్మసీ కాలేజ్ నందు 'సంపూర్ణ శక్తి'అనే అవగాహన కార్యక్రమాన్ని ఆ కాలేజీ విద్యార్థినిలకు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షమా సుల్తానా 'మహిళల ఆరోగ్యం-వారు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను ఎలా ఎదుర్కొనాలి' అనే అంశాలను విశదీకరించారు. ప్రపంచాన్ని మార్పుగలిగే శక్తి కలిగిన మహిళల గౌరవాన్ని కాపాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. మహిళలు నేడు అన్ని రంగాలలో ముందున్నారని, వారు సాధించని విజయాలంటూ ఏమీ లేవని ఈ సందర్భంగా అన్నారు. కుటుంబ సంరక్షణ ప్రధాన ధ్యేయంగా భావించి నిరంతరం విరామం లేని పనులు చేస్తూ తమ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయటంతో నేడు వివిధ అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మలినేని పెరుమళ్ళ ఫార్మసి కాలేజ్ ప్రిన్సిపల్ సుధాకర్, టీచింగ్ స్టాఫ్ రాజేష్ సౌజన్య, సిబ్బంది గిరిధర్, హోప్‌విన్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్‌జీఓ హోం మైదానంలో మహిళా ఉద్యోగులకు మంగళవారం ఆటల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన మహిళా ఆటల పోటీలను ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగూరు షరీఫ్‌లు జెండా ఊపి ప్రారంభించారు. లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, బాల్ బాస్కెట్ అంశాలలో పోటీలు జరిగాయి. జిల్లా మహిళా ఉద్యోగ విభాగం చైర్మన్ రాధారాణి, కన్వీనర్ లక్ష్మీరమ్య, జాయింట్ సెక్రటరీ శివజ్యోతిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 200 మంది మహిళా ఉద్యోగులు ఈ పోటీలలో పాల్గొన్నారు. జిల్లా నాయకులు శ్యాం సుందర శ్రీనివాస్, రాజశేఖర్, వెంకటరెడ్డి, సుకుమార్, శ్రీధర్‌రెడ్డి సిటీ శాఖ నాయకులు సయ్యద్ జానీబాషా, తాలూకా నాయకులు సూరి, కళ్యాణ్ కుమార్, నాగేశ్వరరావు, మరీ పాల్గొన్నారు. విజేతలైన వారికి మార్చి 8వ తేదీన జరిగే మహిళా దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్‌తో బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించిన మేడా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ నెల 8వ తేదీన మేడా ఏజెన్సీ టైగర్ దివంగత ముత్యాల రాయుడు మిత్రమండలి, మేడా మహ మిత్రమండలి వాట్సాప్ గ్రూపుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని మేడా శ్రీనివాస్ తెలిపారు. ఆహ్వాన పత్ర ఆవిష్కరణలో న్యాయవాదులు సుంకర వెంకట భాస్కర రంగారావు, పేదూరి అంబేద్కర్‌లు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-తాడేపల్లి: కొలనుకొండ హైవే పక్కన గుర్తు తెలియని యువకుడి మృతదేహం పడి ఉంది. స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 30 సంవత్సరాల వయసు ఉండవచ్చని చాతిపై హిందీలో పచ్చబొట్టు ఉంది. రైట్ సైడ్ షోల్డర్ పై తేలు గుర్తు పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు నమోదు చేసినట్లు పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

శరవేగంగా శిశిరం చిత్రం షూటింగ్

విశాలాంధ్ర-తెనాలి : శ్రీకృష్ణ ఆర్ట్స్ బ్యానర్‌పై కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో రూపొందుతున్న బాలల చిత్రం శిశిరం చిత్ర షూటింగ్ తెనాలి పరిసర ప్రాంతాలలో శరవేగంగా కొనసాగుతుంది. చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాలను తెనాలి, గోవాడ, సంగంజాగర్లమూడి గ్రామాలలో చిత్రీకరించారు. శివరాత్రి తిరునాళ్ళ సంప్రదాయాన్ని కళ్ళకుకట్టినట్టుగా చిత్రీకరించామని దర్శకుడు రత్నాకర్ తెలిపారు. చినరావూరులో జరిగిన షూటింగ్‌లో ఆ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత క్లాప్ కొట్టి ప్రారంభించారు. రత్నాకర్ చిత్ర విశేషాలను తెలిపారు. నటీనటులు లిటిల్ స్టార్ భాను, మాస్టర్ దేవ్, కె.మధుకర్, డి.వెంకట్, కో డైరెక్టర్ రావూరి రమణ, అసోసియేట్ డైరెక్టర్‌గా విజయ్ వర్ధన్ రాజ్, సినిమాటోగ్రఫీ డి.మధు, డి.ఓ.పిలుగా డి.నాగరాజు స్టిల్స్ ఎస్.ఎస్.వి.శేఖర్, ప్రొడక్షన్ డిజైనర్‌గా శ్రీకాంత్‌లు పని చేస్తున్నట్లు చెప్పారు. చిత్రంలోని భక్తి పాట మూడు కనుల చాలవా ముక్కంటి పాటకు శ్రోతల నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఆలపాటి గెలుపు ప్రజా విజయం : యాగంటి

విశాలాంధ్ర-మాచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం ప్రభుత్వంపై ప్రజలకున్న విశ్వాసం మరోసారి రుజువైందని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. యాగంటి మాట్లాడుతూ పట్టభద్రులు తమ ప్రభుత్వాన్ని ఆదరించడం శుభపరిణామమన్నారు. వంగవరపు కోటేశ్వరావు, కొండలు, ప్రసాద్, బ్రహ్మం, కోటేశ్వరరావు, ఆంజనేయులు, వేముల దుర్గరావు, వీరేశ్వరావు, గొర్రె వీరయ్య, దొడ్డా చందు, మస్తాన్, మల్లెల శివ పాల్గొన్నారు.

ఇంటి ముందు బైక్ చోరీ

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన మున్సిపల్ వర్కర్ నక్కల మిల్టన్ ద్విచక్ర వాహనం చోరీకి గురైందని చుట్టుపక్కల వెతికి విచారించిన కనపడకపోవడంతో పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీహరి కేసు నమోదు చేశారు. పొన్నూరు ప్రాంతంలో ఇటీవల వరుస దొంగతనాలు జరగటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 20 రోజుల వ్యవధిలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురవటం గమనార్హం.

వైన్ షాపులో చోరీ

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలోని రష్మిక వైన్ షాపులో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈ నేపథ్యంలో పట్టణ ఎస్ఐ శ్రీహరి నేతృత్వంలో గుంటూరు క్లూస్ టీం సిబ్బంది వైన్ షాపులో వేలిముద్రలు సేకరిస్తున్నారు. వేలిముద్రల ఆధారంగా దుండగులను త్వరలో పట్టుకుంటామని మీడియాకు తెలిపారు. చోరీ జరిగిన సూపర్ బజార్లో కూడా వేలిముద్రలు సేకరిస్తామని అన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర-పొన్నూరు: వాహన చట్టంలోని కొత్త నిబంధనలు అమలు లోకి వచ్చాయని ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని నార్త్ డి.ఎస్.పి మురళీకృష్ణ పెదకాకాని పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనదారులకు సూచనలు చేశారు. నిబంధనలు పాటించకపోతే భారీ మొత్తంలోనే జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా కారు నడిపే టప్పుడు కూడా సీటు బెల్టు పెట్టుకోవాలని అతివేగం ప్రాణహానికి మూలం అవుతుందని సూచించారు. సీఐ పి.నారాయణస్వామి పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో నగదు, సరుకులు చోరీ

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలోని బాపట్ల బస్టాండ్ వెనుక సత్య గ్రాండ్ బజార్ సూపర్ మార్కెట్లో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు షట్టర్ తాళాలు పగలకొట్టి రూ.20వేల నగదుతో పాటు విలువైన సరుకులు ఎత్తుకెళ్లారు. సూపర్ మార్కెట్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు రంగ ప్రవేశం చేసి వివరాలు సేకరిస్తున్నారు. ఒకే రోజు సూపర్ మార్కెట్‌తో పాటు పక్కనే ఉన్న వైన్ షాపులో చోరీ జరగటం గమనార్హం.

489 మంది విద్యార్థుల హాజరు

విశాలాంధ్ర-దాచేపల్లి : ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. 501 మంది విద్యార్థులకు 489 మంది హాజరయ్యారు. మిగతా 12 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బొబ్బిలి వెంకటేశ్వర్లు తెలిపారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన

విశాలాంధ్ర-దాచేపల్లి : రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తమ పేరును నమోదు చేసుకోవాలని ఏఓ పాపకుమారి రైతులను కోరారు. ఈ మేరకు మంగళవారం పెదగార్లపాడులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెబ్ లాండ్‌లో పొలం కలిగిన ప్రతి రైతు తమ పేరును విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌తో లింకైన ఫోన్‌ను కూడా తీసుకుని సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. దీని వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలన్నీ వర్తిస్తాయని తెలిపారు.

ఆక్స్ ఫోర్డ్ విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక తిమ్మాయపాలెం రోడ్డు నందుగల ఆక్స్ ఫోర్డ్ స్కూలులో ఐదవ తరగతి చదువుతున్న డి.శివానందన, 8వ తరగతి చదువుతున్న సిహెచ్ ఉమా మహేష్ విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ కరాటే ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మి కుమారి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు కరాటే శిక్షణ చాలా ముఖ్యమని, ఆత్మ రక్షణలో మెలకువలు తెలుసుకొని ఉండాలని, అలాగే కరాటే నేర్చుకోవడం వల్ల మంచి ఆరోగ్యం ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ షేక్ కాజా, మొగిద్దీన్‌ను పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

సీసీ రోడ్లను పరిశీలించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర-నూజెండ్ల : మండలంలోని జేసీ నగర్, గాంధీనగర్ గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్స్, ఇంకుడు గుంతలను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరు ఉమాదేవి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమెతో పాటు పంచాయతీ రాజ్ ఏఈ అల్లాబక్షు ఉన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - వినుకొండ : శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థినీ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, వినుకొండ ప్రభుత్వ సుపత్రి సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ అబ్దుల్ రజాక్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి .శివ ఫణీంద్ర, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ రామ కిషోర్ బెహరా, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర విధ్వంసం, దోపిడీ పునాదులపై

లక్షల కోట్లకు జగన్: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రాన్ని లూటీ చేసిన సంపదతో జగన్ లక్షల కోట్ల రూపాయలకు పడగలెత్తారని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. ఎన్నికల అఫిడవిట్ల ప్రకారమే 2004లో కేవలం రూ.2 కోట్ల ఆస్తులున్న వ్యక్తి ఇప్పుడు 50 కంపెనీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలా అధిపతి అయ్యారని, ఇంత సంపద ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప మరో ధ్యాస లేకుండా సంపద సృష్టి ఊసు లేకుండా రాష్ట్రాన్ని దివాళా తీయించిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారాయన. రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మంగళవారం తన ప్రసంగంలో ఈ మేరకు జగన్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రాన్ని రూ. 10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, కాంట్రాక్టర్లకు రూ. లక్షా 40వేల కోట్లు పెం డింగ్ పెట్టారని ఆ డబ్బంతా ఏం చేశారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల మొదలు కోడిగుడ్లు, చిక్కీల వరకు వేలు, వందల కోట్లు పెండింగ్ పెట్టారని వాపోయారు. సంక్షేమానికి 2.7 లక్షల కోర్లు పెట్టామన్నారు సరే... తెచ్చిన అప్పుల్లో మిగిలిన డబ్బులు ఏమయ్యాయో చెప్పాలన్నారు. జగన్ చేసిన అప్పుల ఫలితంగా అసలు వడ్డీకే కలిపి ఏడాదికి రూ. 60 వేల కోట్లు కట్టాల్సి వస్తోందని, ఎక్కడ రాష్ట్రానికి అప్పులు పుట్టని పరిస్థితులు తెచ్చారన్నారు. అలాంటి విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేసేలా బడ్జెట్ పెట్టడం అభినందనీయం అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చేయూతనిచ్చేలా, రైతేరాజు అన్న మాటను నిజం చేసేలా కేటాయింపులు చేశారన్నారు. 5ఏళ్ల వైకాపా పాలనలో ప్రాజెక్టులన్నీ అటకెక్కాయని, కూటమి వచ్చాకే మళ్లీ అభివృద్ధిని పట్టాలెక్కిస్తున్నామన్నారు. అయిదేళ్ల అమరావతిలో తట్ట మట్టి వేయని జగన్ పోలవరాన్ని కూడా అలానే బలిపెట్టాలని చూశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో మళ్లీ కేంద్రం నుంచి అమరావతి, పోలవరానికి నిధులు తీసుకు వచ్చి పనులు ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. 5ఏళ్ల వైకాపా పాలనలో పిల్లలు చదువుకోవడానికి కనీస వసతుల్లేకుండా చేశారని, బీసీ, ఎస్సీ హాస్టళ్ల ను గాలికి వదిలేశారన్న జీవీ జగన్ జల్సాలకు మాత్రం వందల వేల కోట్లు దుబారా చేశారని ఆవే దన వ్యక్తం చేశారు. పెన్ను, పేపర్లకు రూ.9.74కోట్లు తగలేశారని, ప్యాలెస్‌కు ఇనుప ఫెన్సింగ్ కోసం 12.5 కోట్లు ఖర్చు చేశారన్నారు. సర్వేరాళ్ల మీద ఫొటోలు వేసినందుకు 700కోట్లు పెట్టారని అలానే ఫొటోల పిచ్చికి వేల కోట్లు ఖర్చు చేశారు గానీ విద్యార్థుల చదువుల పట్టించుకోలేదన్నారు. నాసిరకం మద్యం వల్ల 35 లక్షల మంది అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవడం పట్టించుకోలేదన్నారు. ఇంకా సిగ్గు లేకుండా 30ఏళ్లు ఉంటామంటున్నారని. 151 నుంచి 11కి పడేసిన బుద్ధి మారలేదన్నారు. ఇంకా ఏ మొహం పెట్టుకుని మాట్లాడుతున్నారు? దోచుకోవడం తప్ప ప్రాజెక్టులు పూర్తి చేద్దాం, రైతులకు నీరు ఇద్దామని ఏరోజైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. ఎలోకేష్ విద్యామంత్రి అయ్యాక మళ్లీ నాణ్యమైన విద్యకు ప్రభుత్వ బడులను కేరాఫ్‌గా మార్చాలని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జీవో 117 రద్దు చేసి ప్రభుత్వ బడులకు తిరిగి ప్రాణం ఇచ్చారన్నారు. టాప్-100 విశ్వవిద్యాలయాల్లో ఏపీ నుంచి కూడా ఉండాలని మంత్రి లోకేష్ ప్రయత్నం చేస్తున్నారని జీవీ ఆంజనేయులు తెలిపారు.

విద్యుత్ లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర-రెంటచింతల: విద్యుత్ లైన్ మెన్ల సేవలు వెలకట్టలేనివని, విద్యుత్ శాఖలో వారు పునాది వంటి వారని విద్యుత్ శాఖ మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ సింగరయ్య అన్నారు. జాతీయ లైన్ మెన్ దినోత్సవాన్ని పురస్కరించు కుని మంగళవారం ఏపీఎస్పీడీసీఎల్ మాచర్ల డివిజన్ పరిధిలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన నలుగురు విద్యుత్ లైన్ మెన్లను సబ్ స్టేషన్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అధికారులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో లైన్ మెన్ లు అందించే సేవలు చిరస్మరణీయమని, జాతీయ లైన్ మెన్ల దినోత్సవాన వారిని సముచితంగా గౌరవించడం మంచి సంప్రదాయమన్నారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రమిస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది సేవలు అమూల్యమైనవి అన్నారు. ఉత్తమ లైన్ మెన్ అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లును ఏఈ మస్తాన్ వలి, లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసాచారి, సహచర సిబ్బంది అభినందించారు.

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో రెంటచింతలకు చెందిన లైన్ మెన్ సామ్రాజ్యం వెంకటేశ్వర్లు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారి సింగరయ్య

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-నరసరావుపేట: పట్టణంలోని ప్రకాష్ నగర్ లో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఏడిబి) శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీ దత్తా హాస్పిటల్ కి చెందిన డాక్టర్ గార్లపాటి కృష్ణ కాంత్, హాస్పిటల్ సిబ్బంది 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఏడిబి) శాఖ మేనేజర్ ఎం పాల్ బెజ లీల్ మాట్లాడుతూ బ్యాంకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని అన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించిన శ్రీ దత్త హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గార్లపాటి కృష్ణ కాంత్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఎం రమణయ్య బ్యాంకు సిబ్బందితోపాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులను తీసుకున్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

విశాలాంధ్ర-మాచర్ల : మండలంలోని తాళ్లపల్లిలో మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాస్త్రవేత్త డాక్టర్ సైదా నాయక్ హాజరయ్యారు. సైదా నాయక్ మాట్లాడుతూ ఎలుకల నిర్మూలనకు ప్రత్యేక పద్ధతులను పాటించాలన్నారు. రైతులు వారి పొలాలలో ముందుగా బొరియలను గుర్తించాలన్నారు. ఎలుకల నిర్మూలనకు బ్రోమిడియలిన్ అనే రసాయనం చక్కటి పరిష్కారం అన్నారు. బ్రోమిడియలిన్ మందును నూకలు లేదా శనగ నూనెలో కలిపి చిన్న చిన్న పొట్లాలుగా ఏర్పాటు చేసుకొని వాటిని బొరియలలో లోపల ఉంచాలన్నారు. రైతులందరూ ఈ పద్ధతిని పాటించి ఎలుకల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఏఓ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులందరూ రైతు సేవ కేంద్రాలలో తమ పేరును నమోదు చేయించి విశిష్ట సంఖ్యను పొందాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలను పొందాలంటే విశిష్ట సంఖ్య తప్పనిసరి అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉద్యానవనాధికారి సురేష్, ఏఈఓ వలి, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

విశాలాంధ్ర - వినుకొండ : స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర విజన్‌లో భాగంగా మార్చి మూడవ శనివారం లోపు థీమ్ సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధం, 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ గల ప్లాస్టిక్ నిషేధం గురించి మంగళవారం వినుకొండ పట్టణంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఎస్కే ఇస్మాయిల్, సెక్రెటరీలు, మేస్త్రీలు పారిశుధ్య సిబ్బంది పట్టణంలోని ప్లాస్టిక్ హోల్‌సేల్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ ప్రజలు సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వాడకుండా, 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ గల ప్లాస్టిక్ నిషేధించడమైనది కావున జ్యూట్ బ్యాగులు క్లాత్ బ్యాగులు ఉపయోగించాలని కోరారు. తినే ఆహార పదార్థాలను ప్లాస్టిక్ వస్తువులలో ప్యాక్ చేయడం వలన హానికారక క్యాన్సర్ కారకాలు, ఆహార పదార్థాలలో చేరి తీవ్ర అనారోగ్యాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలందరూ కూడా ఈ ప్లాస్టిక్ ను వాడకుండా పురపాలక సిబ్బందికి సహకరించాలని కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్ కోరారు.

పరస్పర దాడులు, ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇరు కుటుంబాల మధ్య పరస్పర దాడులు సోమవారం రాత్రి జరిగాయి. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా, ఒక వ్యక్తికి, మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితులు తేళ్లూరి దేవకుమార్(40), తేళ్లూరి సుందర్ రావు(68), కందుకూరి సాయి (20)కందుకూరి పుల్లమ్మ(45)లుగా గుర్తించారు.

పాత కక్షల నేపథ్యంలో జరిగిన ఘటనగా భావిస్తున్నారు. సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో బాధితులు చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో బాధితుల ఇద్దరిని ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

వైసీపీ శ్రేణులు పోరాటానికి సిద్ధం కావాలి: వైవీ

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్రంలో ఉన్న అన్నివర్గాల ప్రజల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా ప్రతి ఒక్క వైసీపీ కార్యకర్త, నాయకుడు సిద్ధమవ్వాలని రాజ్యసభ సభ్యులు, వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. తాడేపల్లి కుంచనపల్లిలోని శ్రీ ఫార్చ్యూన్ గ్రాండ్‌లో గుంటూరు జిల్లా వైసీపీ రెండవ కార్యవర్గ సమావేశాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజ్యసభ సభ్యులు, పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ఆదర్శంగా గుంటూరు జిల్లా ఉంటుందని అన్నారు. వివిధ విభాగాల అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న రైతులు ఎంతో నష్టపోయారని, ఒక్కొక్క రైతు ఒక్క ధాన్యంలోనే ఒక క్వింటా బస్తాకు రూ.500 నుంచి రూ.700లు నష్టపోయారని అన్నారు.

ఈ తొమ్మిది నెలల కాలంలో ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు చేయకుండా వైసీపీ కార్యకర్తలు, నాయకులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబు సమావేశంలో తీర్మానించిన మూడు విషయాలను దొంతిరెడ్డి వేమారెడ్డి ప్రతిపాదించగా పలువురు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు వనమాబాల వజ్రబాబు, అంబటి మురళీకృష్ణ, షేక్ నూరి ఫాతిమా, బాలసాని కిరణకుమార్, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజ నారాయణ, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు పానుగంటి చైతన్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కుటుంబ ఎదుగుదలలో మహిళల పాత్ర గొప్పది'

విశాలాంధ్ర-ఈపూరు : మహిళలే సృష్టికి మూల కారణమని వారి ఓర్పు సహనం కుటుంబ ఎదుగుదలతో వారి పాత్ర మహాగొప్పదని, మహిళలను గౌరవించే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని సీడీపీఓ బి.అరుణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన ఈపూరు మార్కెట్ యార్డులో మంగళవారం మహిళలపై అవగాహన కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. న్యూట్రిషన్ యోగ మిల్లెట్స్ హెల్త్ డైట్ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నవీన్ హాజరై బ్యాలెన్స్ డైట్ న్యూట్రిషన్ ఫుడ్ శరీరం గ్రహించగలిగిన ఆహార పదార్థాలు ఆహార వినియోగం ఆహార సమయపాలన వంటి విషయాలు గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. సీడీపీఓ బి.అరుణ మాట్లాడుతూ సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలను గుర్తించి సంబంధిత మహిళలకు చేయూతనందించి స్వశక్తితో ఎదిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, స్త్రీ పారిశ్రామికవేత్తగా రాణిస్తే వేలాది మంది మహిళలను భాగస్వామ్యం చేయడమే కాకుండా సంబంధిత మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేటట్లు చేయొచ్చన్నారు. యోగ ఉపాధ్యాయులు యోగ ఆవశ్యకత గురించి వివరించారు. సూపర్‌వైజర్లు కె.చిన్నమ్మాయి, వి.శ్రీదేవి, కె.రాజ్యలక్ష్మి, ఎస్‌కే మస్తాన్ బి, ఆర్.పద్మజారాణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పారా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ శ్యామ్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-దుర్గి: పారా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపి యన్‌గా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇంజమూరి శ్యామ్ కు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘన సన్మానం జరిగింది. గత నెల 18వ తేదీన చెన్నై లో జరిగిన 23వ పారా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీ లో పురుషుల-44 కేటగిరి లో జరిగిన హై జంప్ లో ఇంజమూరి శ్యామ్ పాల్గొని బ్రోనాజ్ మెడల్ సాధించారు. దీనిని పురస్కరించుకొని దుర్గి గ్రామానికి చెందిన ఇంజమూరి శ్యామ్ ను మంగళవారం తన స్వగ్రామంలో ఏ.ఈ.ఎల్.సి చర్చిలో పల్నాడు ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి రమేష్ మాదిగ మాట్లాడుతూ పేద కుటుంబం నుండి ఎదిగిన శ్యామ్ భవిష్యత్‌లో మరెన్నో పోటీలలో పాల్గొని మరెన్నో పథకాలు సాధించి మన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని అభినందనలు తెలిపారు. మాచర్ల నియోజక వర్గం ఇంచార్జ్, ఎంఎస్‌పి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గడ్డిపర్తి శ్రీనివాసరావు మాదిగ మాట్లాడుతూ ప్రభుత్వం వారు ఇలాంటి వారిని ప్రోత్సహించి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటే రాబోవు రోజుల్లో మరెన్నో పథకాలు శ్యామ్ సాధించాలని కోరుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజమూరి సంజయ్, రాయపాటి మాణిక్యరావు, కందుకూరి అక్కులు, సాగరు, రమేష్, అమర్, బాబురావు, బుజ్జి బాబు అనిల్, జీవన్, చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

జీరో ప్రమాదాలతో ఉత్పత్తి జరగాలి

విశాలాంధ్ర- దాచేపల్లి: పారి శ్రామిక రంగం లో జీరో ప్రమా దాలతో కూడిన ఉత్పత్తి జరగాలని అభిలషిస్తున్నట్లు గామాలపాడు సాగర్ సిమెంట్స్ ప్లాంట్ హెడ్ సుబ్బారావు చెప్పారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కర్మాగారంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సేఫ్టీ మేనేజర్ సంజయ్ కుమార్ సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్లాంట్ హెడ్ సుబ్బారావు మాట్లా డుతూ కార్మికుల ప్రవర్తనలో కూడా మార్పు రావాలని కోరారు. అందరి సహకారంతో కర్మాగారంలో ఈ ఏడాది జీరో ప్రమాదాలతో ఉత్పత్తి తీసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది కూడా జీరో ప్రమాదాల లక్ష్యంతో పని చేస్తామని భరోసా ఇచ్చారు. క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో విజేతలకు బహుమతులు అందజేశారు. సేఫ్టీ ప్రతిజ్ఞ చేశారు.

చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలి : ఎంపీ

విశాలాంధ్ర-నరసరావుపేట: విద్యార్థులకు ఆటల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, గెలుపు ఓటములు సమానంగా చూసే వ్యక్తిత్వం ఏర్పడుతుందని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు.

పట్టణ పరిధిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ఒక స్కూలు అభివృద్ధి పథంలో నడవాలంటే సమర్థవంతమైన యాజమాన్యంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఎంతో ముఖ్యమని, విద్యార్థులు మొబైల్ ఫోన్లకు మరియు సామాజిక మాధ్యమంలో దూరంగా ఉండాలని అన్నారు. స్కూల్లో ఉన్న విశాలమైన ఏ.సీ క్లాసులు, ఆటస్థలం స్విమ్మింగ్ పూల్, ప్రయోగశాలలు డిజిటల్ బోర్డులు, యోగా, కరాటే సంగీత వాయిద్యాలు వంటి సౌకర్యాలు చూసి యాజమాన్యం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, పాతశాల చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు, డైరెక్టర్లు నాగోతు సవిత, పాతూరు చక్రధర్ స్కూలు ప్రిన్సిపల్ అల్బానా వునియాల్ , ప్రముఖ డాక్టర్లు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, తల్లిదండ్రులు, స్కూలు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం కరాటే వివిధ రకాల సాంస్కృతి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

చదువుతో పాటు సాంస్కృతి కార్యక్రమాలు, క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముఖ్య అతిథులు పతకాలు, బహుమతులు అందజేసి అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగరంలోని వార్డ్ సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, పనివేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టంచేశారు. గుంటూరు నగరంలోని శ్యామల నగర్ 99, 100, 101, 102, 103, 104 వార్డ్ సచివాలయాలను కమిషనర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి సచివాలయ కార్యదర్శుల హాజరు సక్రమంగా లేకపోవడం, పనివేళల్లో మూమెంట్ రిజిస్టర్‌లో నోట్ చేయకుండా వెళ్లడం గమనించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి వార్డ్ సచివాలయాలు ఆకస్మిక తనిఖీలు చేస్తామని, కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించకుంటే చర్యలు తప్పవన్నారు. కార్యదర్శులు స్థానిక సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి సచివాలయం పరిధిలోనే చర్యలు తీసుకోవాలని, అప్పుడే సిబ్బంది స్థానికులకు సత్సంబంధాలు ఉంటాయన్నారు. అలాగే ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయంలో కార్యదర్శులు అందరూ అందుబాటులో ఉండి, ప్రజల నుంచి అందే అర్జీలను తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రజల సర్వీస్ రిక్వెస్ట్‌లు పెరగాలన్నారు. వివిధ ప్రభుత్వ సర్వీసులు, సర్వేలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సచివాలయం పరిధిలో ఇంటి, కుళాయి పన్నులను నూరు శాతం వసూళ్లు చేయడంలో కార్యదర్శులు సంయుక్త కృషి చేయాలని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, నోడల్ అధికారి లీలారాణి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిందీ, ఇంగ్లీష్ ఉచిత బోధన

విశాలాంధ్ర-దాచేపల్లి : నారాయణపురంలోని యోగ విజ్ఞాన కేంద్రంలో హిందీ, ఇంగ్లీష్ విభాగాల్లో ఉచిత బోధన చేయనున్నట్లు కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి గోపీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే సామాజిక స్పృహ కలిగిన ఉపాధ్యాయులు కూడా ముందుకు వచ్చి విద్యార్థులకు ఉచితంగానే బోధన చేయాలని పేర్కొన్నారు. దీని కోసం వచ్చే ఉపాధ్యాయులు యోగ విజ్ఞాన కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించండి

విశాలాంధ్ర-మంగళగిరి : నేటి విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాన్ని, సాంకేతికతను సమాజ శ్రేయస్సుకే వినియోగించాలని, దుర్వినియోగం చేయొద్దని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విద్యార్థినీ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లో జరుగుతున్న రసాయన శాస్త్ర విభాగ జాతీయ సదస్సు ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వ విద్యాలయంలో విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తూ విజ్ఞానవంతులుగా, పరిశోధనలు గావించుతూ శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. గతం కంటే ఇప్పుడు విజ్ఞాన శాస్త్రం ఎంతో అభివృద్ధి చెందిందని, విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం సాంకేతికతతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. టాంజానియా నుండి వచ్చి కీలక ఉపన్యాసం అందించిన ఆచార్య ఎస్‌బి నంబూరిని ధూళిపాళ్ల ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని సదస్సులు విద్యార్థులకు ఉపయోగపడేలా నిర్వహించాలని తెలిపారు. ఈ సదస్సులో విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి. సింహాచలం పాల్గొని శాసన సభ్యుల చేతుల మీదుగా సదస్సు ధ్రువీకరణ పత్రాలను అభ్యర్థులకు అందించారు. రెండవరోజు కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో ఆచార్యుల శిక్షణలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ సదస్సుకు ఆచార్య ఎమ్ సుబ్బారావు సంచాలకులుగా వ్యవహరించగా ఆచార్య డి. రామ్‌చంద్రన్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సదస్సులో ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య పి. బ్రహ్మాజీ, అధ్యాపకులు బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

యం.వి.ఓ.పి.నెం.669/2019

బిట్వీన్:

కేతావత్ మొంగు - పిటీషనరు

మరియు

దేవళ్ళ కృపా రావు వగైరాలు- రెస్పాండెంట్లు

ఆర్-1: దేవళ్ళ కృపారావు, తండ్రి. గురవయ్య, నివాస డోర్ నెం.26-35-51/4, హనుమాన్ నగర్ 2వలైను, గుంటూరు -522004, గుంటూరు జిల్లా. (ఆటో ఓనర్, నెం. AP39Y9697)

పై నెంబరు యం.వి.ఓ.పి.లోని పిటీషనరు యాక్సిడెంటులో తనకు తగిలిన దెబ్బలుకు నష్టపరిహారం కోరుచూ దాఖలు చేసిన పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టువారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:23-04-2025 కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారాగాని హాజరై మీకుగల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 23-04-2025

రావి మనుదత్త, పిటీషనరు తరపు అడ్వకేట్, గుంటూరు.

ఆలపాటికి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - వినుకొండ : ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ ఆధిక్యంతో విజయం సాధించడం పట్ల వినుకొండ తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు లక్ష్మీపురంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ వినుకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు పంచుమర్తి భూపతిరావు, డీసీ ఛైర్మన్ గంగినేని రాఘవరావు, శివశక్తి ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జీవీ రమణారావు, కార్యాలయ మేనేజర్ రమేష్, దిలీప్ తదితరులు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర-పొన్నూరు: చిరుధాన్యాల తీసుకోవడం వలన గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అధిక ఆరోగ్యము లభిస్తుందని ప్రతి ఒక్కరూ వాటిని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని గుంటూరు జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పాత పొన్నూరు అంగన్వాడి కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో పౌష్టికాహార స్టాల్స్ ను తిలకించారు. అనంతరం స్వీట్ రైటింగ్‌తో పాటు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి మండల ఆఫీసర్ శ్రావణి, సిడిపిఒ వెంకటరమణ, డైరెక్టర్ అలేఖ్య, సూపర్వైజర్ శ్యామల, సువర్తకుమారి, తల్లులు, గర్భవతులు, బాలింతలు, అంగన్వాడి ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, సోషల్ మీడియాపై అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో పాత గుంటూరు, గుంటూరు వారితోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని అన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగం జరుగుతుందని, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లకు బానిసలుగా మారిన యువత ఎక్కువ శాతం ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్, పాత గుంటూరు, గుంటూరువారితోట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.గుణశీలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌వీ కె.అన్నపూర్ణమ్మ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన అధికారి

విశాలాంధ్ర-తాడేపల్లి: జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుబ్బరత్నమ్మ మంగళవారం తాడేపల్లిలోని శాఖ గ్రంథాలయన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ అధికారికి సూచించారు. గ్రంథాలయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక గ్రంథాలయ అధికారి ఎస్కే నాగూర్ భాష పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని, అప్పుడు ప్రభుత్వం ఆశించిన ఫలితం వస్తుందని మంగళవారం శాసన సభలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మకమైన పారిశ్రామిక విధానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూనే.. క్షేత్రస్థాయిలో వీటి అమలు కోసం తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. గుంటూరు ఆటో నగర్‌లో మోటారు వాహన వ్యాపారులు అధికంగా ఉన్నారని, ఈ ప్రాంతం మరింత పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం చేయూతతో పాటు అధికారుల సహకారం అవసరమని వివరించారు. 2024-25 రాష్ట్ర బడ్జెట్ గత ఐదేళ్ల విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా రూపుదిద్దిన సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యమిస్తూనే ప్రజారంజకంగా కూర్చు చేశారని తెలిపారు. గృహ నిర్మాణాలకు నిధుల పెంపు, పీ4 మోడ్ లో అభివృద్ధి, తెలుగుభాషాభివృద్ధికి నిధుల కేటాయింపు, డ్రగ్స్ నియంత్రణ కోసం ఈగల్ టీమ్ ఏర్పాటు, మహిళలను మహారాణులను చేసేలా దీపం పథకం, మధ్యాహ్న భోజన పథకానికి నిధుల కేటాయింపు, టెంపుల్ టూరిజం డెవలప్ మెంట్, వైద్యానికి పెద్ద ఎత్తున నిధుల కేటాయింపుపై, పారిశ్రామిక ప్రగతిపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

2047 విజన్‌కు తగిన విధంగా బడ్జెట్: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 విజన్ కు తగిన విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉన్నదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొని, బడ్జెట్ పై ప్రసంగించారు. ఓర్పు, నేర్పు, సహనం కలిగి, సవాళ్ళను అధిగమించి, ప్రగతికి బాటలు వేసే విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రము అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తుందన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్య వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేస్తూ 31,805 కోట్లు పాఠశాల విద్యకు, 2506 కోట్లు ఉన్నత విద్యకు కేటాయించడం భావితరాలకు బాటలు వేయడమేనని అన్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ లో ఏ చిన్న పని చేయటానికి కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి. అయితే మున్సిపల్ బిల్లులను వికేంద్రిక విధానం ద్వారా చెల్లించే అధికారాన్ని ఇవ్వటము ప్రభుత్వం యొక్క నిబద్ధతకు నిదర్శనమని, దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు.

తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-మంగళగిరి: హైదరా బాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కోట్ల విజయ భాస్కరరెడ్డి స్టేడియం నందు మార్చి 1,2 తేదీల్లో నిర్వహించిన 13వ ఇంటర్ స్కూల్ తైక్వాండో ఛాంపి యన్ షిప్ పోటీల్లో మంగళగిరి ఈగల్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ చిల్లపల్లి నరేంద్ర కుమార్ తెలిపారు. మంగళగిరిలో ఆయన మాట్లాడుతూ పోటీల్లో 10మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో సబ్ జూనియర్స్ విభాగంలో కే. నాగ మణికంఠ వెండి పతకం, కాజ గ్రామానికి చెందిన బి. జస్విత, ఎస్. జయ శ్రీకర్ రెడ్డి, ఐ.లికితాక్షర్, ఈ. ధీరజ్, యూ. ధనుష్ కుమార్ లు రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరికి కాజలోని ఈగల్ మార్షల్ ఆర్ట్స్ కార్యాలయంలో మెడల్స్, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలువురు పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మహిళలకు అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-కాకుమాను : అంతర్జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని కొల్లి మర్ల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.
ఈ సందర్భంగా అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు వెంకాయమ్మ మాట్లాడుతూ
మహిళలలో రక్తహీనత నివారణకు
ఐరన్, పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.అన్నమ్మ, మహిళలు పాల్గొన్నారు.

బాలిక వేధింపుపై కేసు నమోదు

విశాలాంధ్ర-పెదనందిపాడు: మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన
మహేష్ అనే యువకుడు ప్రేమించమని ఇబ్బంది పెడుతున్నాడని ఆ బాలిక
ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్సై మధుపవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీయూ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుపై హర్షం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : శాసనమండలి సభ్యుల ఎన్నికల్లో ఎస్టీయూ మద్దతు పలికిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదే శ్రీనివాసులనాయుడు, కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేషన్ శాసనమండలి సభ్యులుగా ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పేరాబత్తుని రాజశేఖర్‌లు ముగ్గురు అభ్యర్థులు అఖండ మెజారిటీ గెలవడం పట్ల ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కెకు కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాబోవు కాలంలో ఉపాధ్యాయులు ఉద్యోగులు నిరుద్యోగులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యల పట్ల వీరు శాసనమండలిలో గళం విప్పి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముగ్గురు అభ్యర్థులకు అఖండ విజయాన్ని చేకూర్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లకు ఎస్టీయూ తరపున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రకటన చేసిన వారిలో చిలకలూరిపేట ప్రాంతీయ శాఖల పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, చిలకలూరిపేట పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్లన జయప్రకాష్, నాదెండ్ల మండల అధ్యక్షులు షేక్ మక్బుల్ భాష, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఎడ్లపాడు మండల అధ్యక్షులు జి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, చిలకలూరిపేట మండల అధ్యక్షులు బొంత రవి, ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి తదితరులు ఉన్నారు.

ఆలపాటికి దేగల శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఘనవిజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ పుష్పగుచ్ఛాని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలపాటి విజయంలో కీలక పాత్ర పోషించిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు, కార్యకర్తలకు, గ్రాడ్యుయేట్స్‌కి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో నాయీబ్రాహ్మణుల అభివృద్ధి

విశాలాంధ్ర-పెదకూరపాడు: కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణ మ్యానిఫెస్టోలో తెలిపిన విధంగా సెలూన్ షాపులు ఉన్న ప్రతి ఒక్క నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షణీయమని రాష్ట్ర నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. నాయి బ్రాహ్మణులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ కి 450కోట్లు నిధులు, ఆదరణ పథకం క్రింద కేటాయించిన 1000కోట్ల బడ్జెట్లో నాయి బ్రాహ్మణులకు వృత్తిపరమైన పనిముట్లు అందించడం జరుగుతుందని అన్నారు. నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారిని ప్రతి దేవాలయ ట్రస్ట్ బోర్డులో సభ్యులుగా నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు. నాయి బ్రాహ్మణుల మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తారని అన్నారు. వారికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో గంగన్నపల్లి నరసింహారావు రాయల శ్రీనివాసరావు గుంటుపల్లి వెంకటేశ్వరరావు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర పశువైద్యుల క్రికెట్ లీగ్-2025 ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశువైద్యుల క్రికెట్ లీగ్-2025 నాగార్జున యూనివర్సిటీ రోడ్డులోని డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీలో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధక సంచాలకులు డాక్టర్ దామోదర్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రజనీ కుమారి, గుంటూరు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ నరసింహ రావు, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జయప్రకాష్, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఈశ్వర్ రెడ్డి, గుంటూరు జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, 13 ఉమ్మడి జిల్లాల నుంచి పోటీలలో పాల్గొనే పశువైద్య క్రీడాకారులతో పాటు సక్కు పౌల్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి వెంకట్ రామ్, స్నస్టిక్ ఫార్మా, వర్మా గ్రూప్ వారు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక సంచాలకులు డాక్టర్ దామోదర్ నాయుడు ప్రసంగిస్తూ ఇటువంటి క్రీడా కార్యక్రమాల ద్వారా పశువైద్యుల్లో నూతనోత్సాహం, క్రీడాస్ఫూర్తి, పశువైద్యుల్లోని సత్సంబంధాలు పెంపొందుతాయన్నారు. ఇటువంటివి విరివిగా జరిగించాలని సూచించారు. రాష్ట్ర పశువైద్యుల క్రికెట్ లీగ్-2025 ఈ నెల 7వ తేది వరకు జరుగుతాయని రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జయప్రకాష్ తెలిపారు.

ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ మహిళా విభాగం క్రీడలు ప్రారంభం

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ఉద్యోగులతో నిర్వహించే ఆటల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలాపించారు. మహిళ మూర్తులు ఇటువంటి క్రీడలు ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయంగా ఉందని, శారీరక దృఢత్వంతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ ద్వారా క్రీడాకారులకు తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీజీవోస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మల కుమారి, కన్వీనర్ మాధవి గారు, ఆల్ ఇండియా ఎన్ ఈసీ మెంబెర్ శాంతి శ్రీ, మహిళ ప్రతినిధులు శివ లీల, విజయశ్రీ, ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోన్2 అధ్యక్షుడు ఎం రాజబాబు, ఏపీ ఎన్జీజీవో నగర శాఖ అధ్యక్షులు సి వి.ఆర్ ప్రసాద్ ఉన్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అనన్య సామాన్యమైనది

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు ఉన్నత పాఠశాలలో గుడ్లవల్లేరు ఎస్ ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలికలకు మహిళా సాధికారత పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణ మహిళల భద్రత మరియు రక్షణ అనే అంశంపై ముందుగా మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అనన్య సామాన్యమైనది కానీ, ఆరంభం నుండి ఇప్పటివరకు మహిళలు వివిధ రకాల సవాళ్లను ఎదుర్కొంటూ వస్తున్నారన్నారు. మహిళలకు భద్రత కల్పించటంలో వ్యక్తిగత జాగ్రత్తలు మాత్రమే కాకుండా, ప్రభుత్వ, కుటుంబ మరియు సమాజ స్థాయిలో మార్పులు రావాలని కోరారు. అలాగే డిజిటల్ యుగంలో మహిళల భద్రత, సామాజిక మాధ్యమాల్లో గోప్యత అనే అంశంపై మాట్లాడుతూ నేటి యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, మహిళలు సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో పాల్గొంటూ, తమ అభిప్రాయాలను వెలిబుచ్చే అవకాశాన్ని పొందుతున్నారన్నారు. ఇది ఎంతో మంది హ్యాకర్లు, ట్రోలింగ్ మరియు ఆన్‌లైన్ వేధింపులకు గురయ్యే పరిస్థితిని కూడా తెచ్చిపెట్టిందని, మహిళలు తమ వ్యక్తిగత సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని, స్ట్రాంగ్ పాస్‌వర్డ్స్ ఉపయోగించాలని, అనవసరమైన షేరింగ్‌ను నివారించాలని, అంతేకాకుండా, సైబర్ క్రైమ్ విభాగానికి శిక్షణ కలిగి ఉండి మహిళలు ఆన్‌లైన్ వేధింపులకు గురైతే భయపడకుండా అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే ఆత్మరక్షణ ఒక ప్రత్యామ్నాయం కాదు, అవసరం, కార్యాలయాల్లో మహిళల భద్రత లైంగిక వేధింపులను నివారించడం, పబ్లిక్ ప్రదేశాల్లో మహిళల భద్రత సవాళ్లు మరియు పరిష్కారాలు, మహిళల భద్రతలో పురుషుల పాత్ర వంటి విషయాలను విద్యార్థులకు వివరించి మహిళల భద్రత అనేది ఒక రోజు చర్చించాల్సిన విషయం కాదనీ, నిత్యం పాటించాల్సిన ధర్మం అని మహిళల భద్రత కోసం ప్రభుత్వం, కుటుంబం, సమాజం కలిసి పనిచేయాలని, యువతలో మానసికత మారాలని, సంస్కృతి మెరుగుపడాలని, నిర్భయంగా జీవించగల సమాజాన్ని అందరం కలసి నిర్మిద్దా%శీ% అని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు శక్తి టీమ్, మహిళా పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతో సమాజ వికాసం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మహిళా చైతన్యంతోనే సమాజ వికాసం సాధ్యమవుతుందని కె.బి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం యు.జి.సి ఉమెన్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో 'విషింగ్ ట్రీ' పేరుతో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. తమ అభివృద్ధికి కారకులైన మహిళలను తలచుకుని, వారికి కృతజ్ఞతలు చెప్పడంతో పాటు వారి పేరుతో ప్లకార్డు రాసి మొక్కలకు వాటిని కట్టి, ప్రదర్శించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు అగ్రస్థానంలోకి రావాలని ఆకాంక్షించారు. అసాంఘిక శక్తుల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. . హిందూ హై స్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ దేశపురోభివృద్ధిలో మహిళలపాత్ర కీలకమైందన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ పి.ఎల్.రమేశ్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, ఉమెన్ స్టడీస్ సెంటర్ కన్వీనర్ శ్రీదేవి, సభ్యులు గౌతమి, వనమాదేవి, జి.సీతారత్నం, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల విజయోత్సవాలు

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు విషయమై విస్సన్నపేటలో కూటమి పార్టీల నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో కేక్ కత్తిరించి, పంచటంతోపాటు, టపాసులు పేల్చి విజయోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ లో ఎస్.ఆర్.జి.ఇ.సి క్రీడాకారుల ప్రతిభ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ టీములు ఎస్.ఆర్.ఎం.ఎపి యూనివర్సిటి లో ఫిబ్రవరి 27,28 మరియు మార్చి 1 వ తారీఖులలో నేషనల్ లెవల్ స్పోర్ట్స్ ఫెస్ట్ లో మహిళల వాలీబాల్ మరియు కబడ్డీ లో ప్రథమ స్థానం, పురుషుల మహిళల కంబైన్డ్ చెస్ లో ప్రథమం, పురుషుల కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారు. అంతే కాకుండా జి.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ హైదరాబాద్ లో నిర్వహించిన నేషనల్ ఫెస్ట్ లో మహిళల ఖోఖో విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు అని కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.కరుణ కుమార్ తెలియచేశారు. ఈ కళాశాల టీములు అన్ని రకాల క్రీడా పోటీలలో జె.ఎన్.టీ.యూ పోటీలలో మరియు ఇతర క్రీడా పోటీలలో విజయాలు సాధించి కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తెస్తున్నారని తెలియచేశారు. ఈ బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఎం.శివ శంకర్, జి.వెంకటేష్, డి.పూజితలు, కళాశాల యాజమాన్యము, వైస్ ప్రిన్సిపాల్స్ డా.పి.కోదండ రామారావు, డా.ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డా.పి.రవీంద్ర బాబు, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్స్, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఆలపాటికి టీడీపీ నాయకుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పెడన : ఎమ్మెల్సీ ఎన్నికలలో భారీ మెజారిటీతో విజయం సాధించిన కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మంగళ వారం పట్టణ టీడీపీ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పి.టి.ఎల్.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టు శ్యామ్, ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ల సమస్యలను కూటమి ప్రభుత్వ హయాంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆలపాటిని కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. సమాజానికి మంచి విద్యా సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులు న్యాయమైన హక్కులు పొందాలని, ప్రభుత్వంతో చర్చించి వీలైన సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు పరసా జితేంద్ర, కమ్మగంటి. వెంకటేశ్వరరావు (బాబు,) రవికుమార్ మరియు ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమిపై నమ్మకంతో ఆలపాటికి మెజార్టీ

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడలో నియోజకవర్గంలో పట్టబద్రులు సుమారు 5వేల మంది ఓట్లు వేయడం వల్లే ఎమ్మెల్సీగా అలపాటి రాజేంద్రప్రసాద్ అత్యధిక మేజార్టీతో గెలవడం జరిగిందని కూటమి నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయంలోని ప్రజావేదికలో టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మాజీ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్యలతో కలసి స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి అలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం అహర్నిశలు కృషి చేయడం జరిగిందన్నారు. పట్టబద్రుల సమస్యలను పరిష్కరంచే వ్యక్తి అలపాటి అన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు వసంతవాడ దుర్గారావు, పొట్లూరి కృష్ణారావు, శొంఠి రామకృష్ణ, అడుసుమిల్లి శ్రీనివాసరావు, నాయకులు పంద్రాజు సాంభయ్య, సింగవరపు ప్రభకారరావు, రాజేష్, త్రినాధ్, మేరుగు మెజేష్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మద్దతుతోనే లక్ష్మణరావు ఓటమి : కాకరాల

విశాలాంధ్ర-గుడివాడ : వైసిపి మద్దతు వల్ల 3సార్లు ఎమ్మెల్సీగా గెలిచిన లక్ష్మణరావు ఇంత దారుణంగా ఓటమి చెంది అలపాటి రాజేంద్రప్రసాద్‌కు 80వేల పైచిలుకు మేజార్టీ రావడం జరిగిందని వెంకటరఘవపురం సర్పంచ్ కకారాల సుభాస్‌చంద్రబోస్(సురేష్) అన్నారు. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని అయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో అయన మాట్లాడుతూ వైసిపి వల్ల అన్ని వర్గల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఎమ్మెల్సీగా 3సార్లు గెలిచిన లక్ష్మణారావు ఇంత దారుణంగా ఓటమి చెందరన్నారు. అలపాటి రాజేంద్రప్రసాద్ గతంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి నేడు ఎమ్మెల్సీగా గెలవడం వల్ల పట్టబద్రుల సమస్యలు వెంటనే పరిష్కరించడం జరుగుతాయన్నారు.

అరుదైన వ్యాధులపై సమగ్ర చర్యలు తప్పనిసరి

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు

విశాలాంధ్ర విజయవాడ ఎడ్యుకేషన్ : అరుదైన వ్యాధులపై సమగ్ర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ ఆధ్వర్యంలో అరుదైన వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సును విజయవాడలోని ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ అధ్యక్షుడు, సీఈఓ ప్రొఫెసర్ రామయ్య ముత్యాల అరుదైన వ్యాధులపై ఆయన కృషి అపారమన్నారు. వీటిపై ఆయన చూపిన సంకల్పం, నిబద్ధత నిజంగా ప్రశంసనీయం అన్నారు. ఈ గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. అన్ని అరుదైన వ్యాధులకు పరిష్కారం కనుగొనలేమన్నారు. అయితే, బాధితులకు సౌకర్యం, గౌరవం కలిగిన వాతావరణాన్ని అందించే ప్రయత్నం చేయవచ్చన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం.. ప్రతి లక్ష మందిలో 65 మంది అరుదైన వ్యాధులతో బాధపడుతున్నారని చెప్పారు. గణాంకాలు పరిశీలిస్తే ప్రపంచ జనాభాలో ఐదు శాతం వరకు ఏదో ఒక రూపంలో అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుస్తోందన్నారు. కొన్ని వ్యాధులకు పరిమిత చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ, చాలా వ్యాధులకు జీవితాంతం చికిత్స అవసరం అవుతుందన్నారు.

భారత ప్రభుత్వం 2021లో 'నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్' ప్రవేశపెట్టిందన్నారు. ఇది అరుదైన వ్యాధులను సమర్థంగా పరిష్కరించేందుకు ప్రత్యేక విధానాన్ని అందిస్తుందన్నారు. ఈ విధానంలో బాధితులు 12 ప్రత్యేక 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' వద్ద నమోదు చేసుకోవచ్చన్నారు. భారతదేశంలో సుమారు 7-8 కోట్ల మంది అరుదైన వ్యాధులతో బాధపడుతున్నారని అంచనా అన్నారు. దీంతో ఈ కేంద్రాలు సరిపోవన్నారు. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం అరుదైన వ్యాధుల సమస్యను పరిష్కరించేందుకు సొంత విధానాన్ని రూపొందించాలని తెలిపారు. బాధితుల నుంచి బలమైన ప్రాతినిధ్యం లేకపోవడంతో ప్రభుత్వాలు తగిన బడ్జెట్ కేటాయించలేకపోతున్నాయని చెప్పారు. ఈ సంస్థ ముఖ్యమైన సిఫార్సుల్లో ఆంధ్రప్రదేశ్‌లో అరుదైన వ్యాధుల కోసం ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్' ఏర్పాటు చేయడం అన్నారు. ఇది అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులకు మార్గదర్శకత్వం, నమోదుకు అవకాశం కల్పిస్తుందన్నారు. 'రాష్ట్ర ఆరోగ్య నిధి' పథకం ద్వారా 50 లక్షల వరకు ఉచిత ఔషధాలు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ కేంద్రం ఏఐఐఎంఎస్, మంగళగిరి లేదా విశాఖపట్టణంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్) వద్ద ఏర్పాటు చేయడానికి వీలున్నదన్నారు. కేజీహెచ్ ఇప్పటికే 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనుబంధంతో పని చేస్తుందన్నారు. ఇందులో ప్రత్యేక విభాగాలు, సూపర్-స్పెషలైజ్ చికిత్సా సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్యు మ్యాపింగ్ ప్రాధాన్యతను ప్రత్యేకంగా సూచించారన్నారు. అధునాతన జన్యు విశ్లేషణ సాంకేతికతల సహాయంతో జనాభా అధ్యయనం నిర్వహించేందుకు, భారీ స్థాయిలో జన్యు అనుక్రమణ చేపట్టేందుకు ఆయన విశేష కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో బాధితుల గుర్తింపు, నమోదు ప్రక్రియ వేగవంతం అయితే, మెరుగైన వైద్య సంరక్షణ అందే అవకాశాలు పెరుగుతాయన్నారు.

వందల కోట్ల అవినీతికి పాల్పడ్డ సిహెచ్ ఆంజనేయులు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో గుమస్తాగా జీవితం ప్రారంభించిన చలసాని ఆంజనేయులు తెలుగుదేశం పార్టీ అండదండలతో 2019 లో విజయ డైరీ ఛైర్మన్ అయ్యారని, అప్పటి నుంచి జిల్లా వ్యాప్తం వందకోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని గన్నవరం నియోజకవర్గం టీడీపీ క్రియాశీలక కార్యకర్త, న్యాయవాది తగరం కిరణ్ బాబు ఆరోపించారు. టీడీపీ పార్టీ కార్యకర్తలకు ఔట్లెట్లు ఇవ్వలేదని, అన్ని వైసీపీ వారికి ఇచ్చారని, పార్టీ కార్యక్రమాలలో, ఆందోళనలలో ఎక్కడ పాల్గొనలేదని, ఆయనకు విజయ డైరీ ఛైర్మన్ గా కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. గన్నవరం నియోజకవర్గం టీడీపీ క్రియాశీలక కార్యకర్త, న్యాయవాది తగరం కిరణ్ బాబు విజయవాడలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తానూ టీడీపీ నాయకుడిని, కార్యకర్తను అని చెప్పుకునే చలసాని ఆంజనేయులు, ఇప్పటి వరకు వంద విజయ డైరీ ఔట్లెట్ లలో 94 ఔట్లెట్లు వైసీపీ నాయకులు కార్యకర్తలకు ఇచ్చారన్నారు. టీడీపీ ఆఫీస్ పై దాడి చేసిన కేసులో నిందితుడుగా ఉన్న రామాంజనేయులు అనే వ్యక్తికి పశ్చిమ గోదావరి జిల్లా కాంట్రాక్టు మొత్తం కట్టబెట్టారని చెప్పారు. వల్లభనేని వంశి అనుచరుడైన శేషుకు నిడమానూరు వద్ద ఔట్లెట్ కేటాయించారని అన్నారు. జగ్గయ్యపేటలో ఒకప్పటి వైసీపీ నేత అల్లుడికి పాల చిల్లింగ్ కేంద్రాన్ని ఎంతకు కేటాయించారో చెప్పాలన్నారు. వీరవల్లిలో కట్టిన ప్లాంట్ లో స్థలం కొనుగోలు నుంచి నిర్మాణం వరకు అనేక అక్రమాలకు పాల్పడిన ఘనాపాటి అని ఆరోపించారు. వంద కోట్ల రూపాయల వరకు అవినీతికి పాల్పడ్డారని అన్నారు. టీడీపీ పార్టీ కార్యకర్తలకు ఔట్లెట్లు ఇవ్వలేదు, పార్టీ కార్యక్రమాలలో పాల్గొనలేదని, ఆయనకు విజయ డైరీ ఛైర్మన్ గా కొనసాగే నైతిక హక్కు లేదన్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో చరిత్ర సృష్టించిన వెలగపూడి

విశాలాంధ్ర ఉయ్యూరు : వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా చక్కెర పరిశ్రమ స్థాపించి వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలందించిన మహా పురుషుడు వెలగపూడి రామకృష్ణ అని కెసిపి షుగర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఎండి ఇర్మి గార్డ్ కొనియాడారు. మంగళవారం రామకృష్ణ 129వ జయంతి వేడుకలను కర్మాగార ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం 54వ జాతీయ భద్ర భద్రతా దినోత్సవం వేడుకలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్మాగారంలో 25 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న కార్మికులను, భద్రతా ప్రమాణాలను పాటించిన కార్మికులను ఆమె ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్మాగార జనరల్ మేనేజర్ దాసు, కేన్ జనరల్ మేనేజర్ పున్నారావు చెరుకు రైతు సంఘం అధ్యక్షులు కృష్ణారావు పలువురు కర్మాగార అధికారులు, కార్మికులు, చెరుకు రైతులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై అవగాహన

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: సౌరశక్తి విద్యుత్ వినియోగంపై చేపట్టిన సూర్యఘర్ పథకం విషయమై మంగళవారం విస్సన్నపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్.చిన్నరాట్నాలు సూర్యఘర్ పథకం అమలు విధానం, తద్వారా చేకూరే పలు అంశాలను వివరించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఏఈ విజయభాస్కర్, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటి విజయం పై సంబరాలు

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణా గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి మాజీ మంత్రి ఎన్నారై విద్యాసంస్థల అధినేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ అఖండ మెజార్టీతోసాధించిన విజయాన్ని పురస్కరించుకుని మంగళవారం కూచిపూడి సెంటర్లో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి వీరంకి తులసీదాస్, నాయకులు తాతా ప్రభాకరరావు, తాతా సత్యనారాయణ (నాని), యార్లగడ్డ రంగారావు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర- కంచికచర్ల: స్థానిక అరుంధతి నగర్ నందు అరుంధతి విద్యార్థి సేవ సమితి ఆధ్వర్యం లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల కొరకు పుస్తకాలు,పెన్నులు,వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగింది.సమితి సభ్యులు ,విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ ముండ్లపాటి పోతరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జగ్గయ్య పేట కే డి సి సి చీఫ్ మేనేజర్ శ్రీ కె. రమేష్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షల గురించిన విషయాలను,కెరీర్ గైడెన్స్ లను పిల్లలకు దిశ నిర్దేశం చేశారు.పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించి,జీవితం లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెప్పారు. సమితి సభ్యులు వేల్పుల ప్రభాకర్ రావు, మాదుగుల వాసు, నెమలి వాసు ,కొండూరి ప్రవీణ్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గెలాక్సీ ఎ56 5జీ, గెలాక్సీ ఎ36 5జీలను విడుదల చేసిన సామ్‌సంగ్ ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, అద్భుతమైన మేధస్సుతోకూడిన గెలాక్సీ ఎ56 5జీ, గెలాక్సీ ఎ36 5జీలనువిడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. సృజనాత్మకతను తిరిగి ఊహించుకోవడానికి అద్భుతమైన శోధన, దృశ్య అనుభవాలతో, పూర్తిగా కొత్త డిజైన్ భాషతో, కొత్త గెలాక్సీ ఎ సిరీస్ స్మార్ట్‌ఫోన్‌లు మెరుగైన మన్నిక, పనితీరును కలిగి ఉంటాయి. అలాగే బలమైన భద్రత, గోప్యతా రక్షణను సైతం కలిగి ఉంటాయి. గెలాక్సీ ఎ56, గెలాక్సీ ఎ36 ఇప్పుడు సామ్‌సంగ్ డాట్ కామ్, సామ్‌సంగ్ ఎక్స్‌క్లూజివ్, పార్ట్‌నర్ స్టోర్‌లు ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి.

మార్కెట్ అస్థిరతల నిర్వహణ హామీతో ఐసిఐసిఐ ప్రు గిఫ్ట్ సెలెక్ట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 'ఐసిఐసిఐ ప్రు గిఫ్ట్ సెలెక్ట్'ను పరిచయం చేసింది. ఇది దీర్ఘకాలిక పొదుపు ఉత్పత్తి, వినియోగదారులకు లిక్విడిటీని అందిస్తూనే హామీ ఇవ్వబడిన తక్షణ ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ఉత్పత్తి కస్టమర్లకు హామీ ఇవ్వబడిన ఆదాయం ఎప్పుడు ప్రారంభించాలో ఎంచుకోవడం సహా, హామీ ఇవ్వబడిన ఆదాయం యొక్క వ్యవధి, మెచ్యూరిటీ సమయంలో వారు పొందగల మొత్తం వంటి వాటిని సైతం ఎంచుకునే అవకాశం అందిస్తుంది. అదనంగా, లైఫ్ కవర్ భాగం కుటుంబానికి ఆర్థిక భద్రతను నిర్ధారిస్తుంది. ఉత్పత్తి యొక్క ప్రత్యేక లక్షణాలలో ఒకటి పెరుగుతున్న ఆదాయ ఎంపిక, దీనిలో ఆదాయం సంవత్సరానికి 5 శాతం చక్రవడ్డీ రేటుతో పెరుగుతుంది. తద్వారా వినియోగదారులు ద్రవ్యోల్బణాన్ని నిర్వహించడానికి సహాయపడుతుందని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ప్రొడక్ట్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా తెలిపారు.